విలేకరులు కావలెను

పెన్ సత్తా తెలుగు దినపత్రిక

ఆంధ్రప్రదేశ్ అన్ని జిల్లా లకి పెన్ సత్తా దినపత్రికలో పనిచేయుటకు జిల్లా స్టాఫ్ రిపోర్టర్లు, నియోజకవర్గ ఇంచార్జ్ లు, మండల రిపోర్టర్లు కావలెను. వార్తలు పెట్టే వారికే ప్రాధాన్యత.

ఫోన్ నెం : 9885315759



RNI:APTEL/2023/87729

# పెన్ సత్తా

ప్రశ్నించడం అందరి హక్కు...

PEN SATTA Telugu Daily





సంపుటి : 4 | సంచిక :26 | ఎడిటర్ : చింతమనేని అనిల్ కుమార్ | శనివారం 20 జూన్ 2026 | పేజీలు : 08 | వెల : 03

Published from Vishakapatnam Circulated by Vijayawada, Ongole, Chittoor, Kadapa, Tirupati. Nandyal, Hyderabad, Ananthapur, Kurnool


## రాజ్యసభలో పెరుగుతున్న
# బీజేపీ బలం

- మూడింట రెండు వంతుల మెజారిటీ దిశగా ఎన్డీఏ..!
- వరుసగా మూడోసారి అధికారంలోకి వచ్చిన భారతీయ జనతా పార్టీ నేతృత్వంలోని ఎన్డీఏ కూటమి ఇప్పుడు రాజ్యసభలోనూ తన బలాన్ని మరింత పెంచుకుంటున్నట్లు రాజకీయ వర్గాలు విశ్లేషిస్తున్నాయి
- ఇటీవల జరిగిన రాజ్యసభ ఎన్నికల ఫలితాలు ఎన్డీఏకు అనుకూలంగా రావడంతో, ఆ కూటమి సంఖ్యాబలం గణనీయంగా పెరిగింది
- దీంతో భవిష్యత్తులో కీలక బిల్లులను ఆమోదించుకునే దిశగా బీజేపీ మరింత బలపడుతున్నట్లు కనిపిస్తోంది





## నీట్ రీ-ఎగ్జామ్‌కు
# లైన్ క్లియర్

- ఆ పిటిషన్‌ను తిరస్కరించిన సుప్రీంకోర్టు
- నీట్ రీ ఎగ్జామ్ నిలిపివేయాలని పిటిషన్
- తిరస్కరించిన సుప్రీంకోర్టు
- పిటిషన్లను అత్యవసరంగా విచారించలేమని స్పష్టం



## మేకెదాటు డ్యామ్‌కు వ్యతిరేకంగా తమిళనాడు అసెంబ్లీ ఏకగ్రీవ తీర్మానం

- మేకెదాటు వద్ద కావేరి నదిపై కర్ణాటక నిర్మిస్తున్న ప్రాజెక్టుకు వ్యతిరేకంగా తీర్మానం
- ఈ ప్రాజెక్ట్ చట్ట విరుద్ధమన్న సీఎం విజయ్
- ఇటీవల మోదీని కలిసినప్పుడు ఇదే విషయాన్ని ప్రస్తావించిన విజయ్

## ఆర్థిక కార్యకలాపాలు మరింత పుంజుకునేలా
# బ్యాంకర్లు సహకరించాలి




- సచివాలయంలో సీఎం అధ్యక్షతన రాష్ట్రస్థాయి బ్యాంకర్ల సమావేశం
- ఎస్ఎల్‌బీసీ సమావేశంలో 2026-27 వార్షిక రుణ ప్రణాళికపై చర్చ
- వ్యవసాయ రంగం, ఎంఎస్ఎంఈ, స్వయం సహాయ సంఘాలపై సమీక్ష

**అమరావతి**

రాష్ట్రంలో ఆర్థిక కార్యకలాపాలు మరింత పుంజుకునేందుకు వీలుగా సహకారం అందించాలని బ్యాంకర్లకు ముఖ్యమంత్రి చంద్రబాబు సూచించారు. సచివాలయం ఐదో బ్లాక్‌లో 235వ రాష్ట్రస్థాయి బ్యాంకర్ల సమావేశం నిర్వహించారు. 2026-27 వార్షిక రుణ ప్రణాళికపై బ్యాంకర్లతో చర్చించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వార్షిక రుణ ప్రణాళికను విడుదల చేశారు. 2026-27 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి వివిధ రంగాలకు రూ.8.10 లక్షల కోట్ల మేర రుణాలను మంజూరు చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నిర్ణయించారు. వివరాలు 2లో..

## ఏపీలో వంద శాతం సినిమా షూటింగ్ చేస్తే
# భారీ సబ్సిడీ

- త్వరలోనే నూతన ఫిల్మ్ పాలసీ
- ఏపీని ప్రపంచ పర్యాటక గమ్యస్థానంగా మారుస్తాం
- ఈ ఏడాది ఆఖరులో నంది నాటకోత్సవాలు
- పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్



**విజయవాడ**

ఆంధ్రప్రదేశ్‌ను ప్రపంచ పర్యాటక గమ్యస్థానంగా మార్చాలన్నదే తమ కర్తవ్యమని పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ వెల్లడించారు. రెండేళ్ల సుపరిపాలనలో పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖల పురోగతిపై విజయవాడ బెర్మ్ పార్క్ లో శుక్రవారం ఆయన మీడియాకు వివరాలు వివరాలు 2లో..

## అహ్మదాబాద్ విమాన ప్రమాదంలో కొత్త ట్విస్ట్

- సిమ్యులేటర్ డేటాతో కొత్త అంశాలను బయటపెట్టిన పైలట్లు!
- ఎయిర్ ఇండియా విమాన ప్రమాదంపై పైలట్ల సమాఖ్య సంచలన ఆరోపణలు





## భూసమీకరణ రైతులకు
# ప్రత్యేక క్యూఆర్ కోడ్


- పారదర్శకంగా కౌలు చెల్లింపు ప్రక్రియ
- రైతులు క్యూఆర్ కోడ్ ద్వారా సులభంగా వివరాలు తెలుసుకునే అవకాశం
- ఫోన్ ద్వారా స్కాన్ చేసి వివరాలు
- ఆఫీసుల చుట్టూ తిరిగే అవసరం లేకుండా ఇంటి నుంచే సమాచారం తెలుసుకునేలా ఏర్పాట్లు

**అమరావతి**

రాజధాని అమరావతి నిర్మాణానికై భూసమీకరణ కింద భూములు ఇచ్చిన రైతుల సౌకర్యార్థం, ఆంధ్రప్రదేశ్ రాజధాని ప్రాంత అభివృద్ధి ప్రాధికార సంస్థ కీలక సమాచారాన్ని అందుబాటులోకి తీసుకువచ్చింది. రైతులకు అందించే వార్షిక కౌలు చెల్లింపుల స్థితిగతులను పారదర్శకంగా తెలియజేసే ఉద్దేశంతో పూర్తి వివరాలను అధికారిక వెబ్‌సైట్‌లో పొందుపరిచినట్లు తెలిపారు. వార్షిక కౌలు జమ అయిన రైతుల వివరాలతో వివరాలు 2లో..

## అమెరికా-ఇరాన్ చర్చలు వాయిదా..

- ఇటీవల అమెరికా, ఇరాన్ మధ్య చారిత్రక ఒప్పందం
- కొనసాగింపుగా స్విట్జర్లాండ్‌లో జరగాల్సిన అమెరికా-ఇరాన్ చర్చలు
- ఒప్పందం అమలు, పర్యవేక్షణపై ఈ చర్చలు
- అమెరికా ఉపాధ్యక్షుడి పర్యటన వాయిదా పడినట్టు వైట్‌హౌస్ ప్రకటన
- సాంకేతిక, లాజిస్టిక్ కారణాలతోనే ఈ నిర్ణయం తీసుకున్నట్టు వెల్లడి






## పరీక్షల నిర్వహణల్లో లోపాలతో ప్రాణాలు కోల్పోయిన కుటుంబాలకు పరిహారమివ్వాలి

- ప్రధానికి కాక్రోచ్ పార్టీ చీఫ్ లేఖ
- పరీక్షల్లో గందరగోళం కారణంగా విద్యార్థుల బలవన్మరణంపై కాక్రోచ్ పార్టీ వ్యవస్థాపకుడు దీప్కే ఆందోళన
- బాధిత కుటుంబాలకు పరిహారం చెల్లించాలని ప్రధాని మోదీకి లేఖ
- కేంద్ర విద్యాశాఖ మంత్రి రాజీనామా చేయాలని డిమాండ్?

## రూ. 24 కోట్లతో
# 'అరణ్యారామం'

- భవన నిర్మాణానికి భూమి పూజ చేసిన డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్
- ఇక్కడి నుంచే అటవీ శాఖ పరిశోధన, శిక్షణ కార్యకలాపాలు



**అమరావతి**

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అటవీ, పర్యావరణ శాఖల పరిశోధన, శిక్షణ కార్యక్రమాల పర్యవేక్షణ భవనం అరణ్యారామానికి శుక్రవారం మంత్రులు నాదెండ్ల మనోహర్, కందుల దుర్గేష్, అటవీ శాఖ ఉన్నతాధికారులతో కలసి డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ భూమి పూజ చేశారు. మంగళగిరిలోని ఎయిమ్స్ సమీపంలో, బ్రహ్మానందపురం వద్ద రూ. 24 కోట్ల అంచనా వ్యయంతో ఈ భవనాన్ని నిర్మించనున్నారు. ఈ అరణ్యారామం అటవీ, పర్యావరణ శాఖలకు సంబంధించి పరిశోధనలు, శిక్షణా కార్యక్రమాలతోపాటు ప్రకతి, పర్యావరణ పరిరక్షణ కోసం ప్రభుత్వం వివరాలు 2లో..

# నీట్ రీ-ఎగ్జామ్‌కు లైన్ క్లియర్



వైద్య విద్యా కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించే నీట్ రీ ఎగ్జామ్‌కు లైన్ క్లియర్ అయ్యింది. ఈ పరీక్షను నిలిపివేయాలంటూ దాఖలైన పిటిషన్‌ను సుప్రీం కోర్టు కొట్టివేసింది. జూన్ 21న జరగబోయే రీ ఎగ్జామ్ యథాతథంగా కొనసాగుతుందని అత్యున్నత న్యాయస్థానం స్పష్టం చేసింది. ఇటీవల పరీక్ష నిలిపివేయాలంటూ కొందరు విద్యార్థులు సుప్రీం కోర్టును ఆశ్రయించారు. దీనిపై విచారణ జరిపిన న్యాయస్థానం అందుకు నిరాకరించింది. పిటిషన్లను అత్యవసరంగా విచారణ జరపాలంటూ అభ్యర్థుల తరఫు న్యాయవాది కోరగా ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని ధర్మాసనం దాన్ని తోసిపుచ్చింది. నీట్‌కు సంబంధించిన అన్నీ పిటిషన్లు జస్టిస్ పీఎస్ నరసింహ ధర్మాసనం ముందుకు వెళ్లాయని వీటిని కూడా ఆ ధర్మాసనమే విచారిస్తుందని స్పష్టం చేశారు. విద్యార్థులు వేసిన పిటిషన్లలో అత్యవసర పరిస్థితి లేదని ఆయన తేల్చిచెప్పారు. పేపర్ లీకేజీ, అడ్మిట్ కార్డుల డౌన్‌లోడ్‌లో సమస్యలు ఉన్నాయన్న పిటిషన్లను ఈ మేరకు సుప్రీంకోర్టు కొట్టివేసింది విద్యార్థులు, నీట్-యూజీ అభ్యర్థులు దాఖలు చేసిన ఒక ప్రత్యేక పిటిషన్‌పై తక్షణమే విచారణ చేపట్టాలని న్యాయవాది అదీల్ అహ్మద్ కోరారు. అభ్యర్థుల విజ్ఞప్తులను పరిగణనలోకి తీసుకుని జూన్ 21న పరీక్ష నిర్వహించే సాధ్యాసాధ్యాలను పునఃపరిశీలించాలని ఈ మేరకు కేంద్రాన్ని ఆదేశించాలని పిటిషన్‌లో పేర్కొన్నారు. "మానసిక క్షోభ, తీవ్ర ఆందోళన, పరీక్ష రద్దు కావడం వల్ల తలెత్తిన అనిశ్చితి, తగినంత సన్నద్ధత సమయం లేకపోవడం, పరీక్ష సమగ్రతపై అనుమానాలు, ఇతర పరీక్షలతో తేదీలు ఒకేలా ఉండటం, నిర్వహణాపరమైన ఇబ్బందులు, మానసిక ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావాలు వంటి అంశాల నేపథ్యంలో ఈ విజ్ఞప్తులు వస్తున్నాయి." అని పిటిషన్‌లో పేర్కొన్నారు.

**రీ ఎగ్జామ్ నిర్వహించాలన్న నిర్ణయాన్ని ఎవరూ సవాలు చేయలేదు : పిటిషనర్**

అయితే, రీ ఎగ్జామ్ నిర్వహించాలన్న నిర్ణయాన్ని ఎవరూ సవాలు చేయలేదని, అభ్యర్థులకు తగినంత సన్నద్ధత సమయం ఇవ్వకుండా రీ ఎగ్జామ్ తేదీని ఏకపక్షంగా, అసమంజసంగా నిర్ణయించారని మాత్రమే పిటిషన్?లో పేర్కొన్నారని న్యాయవాది తెలిపారు. "రీ ఎగ్జామ్?కు? సంబంధించిన వాతావరణం, ప్రశ్నపత్రం లీక్ అయ్యిందన్న ఆరోపణలు, లీక్ అయినట్లు చెబుతున్న ప్రశ్నపత్రాలు, సోషల్ మీడియాలో వదంతులు, విస్తృతమైన తప్పుడు సమాచారం వంటి వాటితో నిండిపోయింది. దీనివల్ల అధికారులు పదేపదే స్పందించాల్సిన పరిస్థితి ఏర్పడింది. పరీక్షా ప్రక్రియ రద్దు, తదనంతర వివాదాల కారణంగా చీజుజు అభ్యర్థులు తీవ్ర మానసిక సమస్యలను ఎదుర్కొంటున్నారు. కొందరు అభ్యర్థులు ఆత్మహత్యలకు పాల్పడ్డారన్న వార్తలు కూడా వచ్చాయని బహిరంగ నివేదికలు వెల్లడించాయి." అని పిటిషన్ పేర్కొంది. బాధిత అభ్యర్థులందరికీ పరీక్షకు సిద్ధమయ్యేందుకు తగినంత సమయం కల్పించిన తర్వాతే నిర్వహించాలని కోరారు. పరీక్షను వాయిదా వేసి కొత్త తేదీని ఖరారు చేయాలని అధికారులను ఆదేశించాలని విజ్ఞప్తి చేశారు.

**జూన్ 21న రీ-ఎగ్జామ్**

దేశవ్యాప్తంగా వైద్య కోర్సుల్లో ప్రవేశాల కోసం మే 3న నీట్-యూజీ 2026 పరీక్ష నిర్వహించారు. అయితే ప్రశ్నాపత్రం లీక్ ఆరోపణల నేపథ్యంలో మే 12న ఎన్‌టీఏ ఆ పరీక్షను రద్దు చేసింది. ప్రస్తుతం ఈ వ్యవహారంపై సీబీఐ దర్యాప్తు కొనసాగుతోంది. ఈ క్రమంలోనే రీ-ఎగ్జామ్?ను జూన్ 21న నిర్వహించనున్నట్లు చెప్పారు. పరీక్షకు సిద్ధమవుతున్న లక్షలాది మంది విద్యార్థులు చివరి దశలో వదంతులను పట్టించుకోకుండా, తమ సన్నద్ధతపై విశ్వాసం ఉంచి పరీక్షకు హాజరుకావాలని ఎన్‌టీఏ మరోసారి చెప్పింది.

# పరీక్షల నిర్వహణల్లో లోపాలతో ప్రాణాలు కోల్పోయిన కుటుంబాలకు పరిహారమివ్వాలి




దేశంలో పరీక్షల నిర్వహణలో జరుగుతున్న అవకతవకలు, పేపర్ లీక్?ల వ్యవహారంపై కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ఇటీవల పరీక్షల గందరగోళం కారణంగా బలవన్మరణానికి పాల్పడిన విద్యార్థుల కుటుంబాలకు రూ.1 కోటి చొప్పున పరిహారం అందించాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు ప్రధాని మోదీకి లేఖ రాశారు. తమ జీవిత కాలపు సొమ్మును ధారపోసి చదివించిన పిల్లలనే కోల్పోయి, ఆ కుటుంబాలు పూర్తిగా నిరుపేదలుగా మిగిలిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే, కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌ను తొలగించాలన్న తమ సంస్థ డిమాండ్‌ను దీప్కే పునరుద్ఘాటించారు. ఒకవేళ ప్రభుత్వం ఈ విషయంలో వెనకడుగు వేస్తే, ప్రస్తుత విద్యా వ్యవస్థలోని లోపాలను అంగీకరిస్తున్నట్లుగానే భావించాల్సి ఉంటుందని చెప్పారు.

పరీక్షల అనిశ్చితి భరించలేక గత కొన్ని వారాల్లోనే దేశంలో 11 మంది విద్యార్థులు బలవన్మరణానికి పాల్పడ్డారని, అందులో 5 మరణాలు గడచిన 48 గంటల్లోనే జరిగాయని మోదీకి రాసిన లేఖలో అభిజీత్? పేర్కొన్నారు. అయితే, మంత్రి ధర్మేంద్రను తొలగించడం ప్రభుత్వ బలహీనతను కాకుండా జవాబుదారీతనం పట్ల నిబద్ధతను ప్రదర్శిస్తుందని ఆయన అన్నారు. మరోవైపు, విద్యార్థుల మానసిక ఆరోగ్యం, భద్రతకు ప్రాధాన్యత ఇస్తూ విద్యా వ్యవస్థలో తక్షణ సంస్కరణలు తీసుకురావాలని తెలిపారు. లేనిపక్షంలో విద్యార్థులు, తల్లిదండ్రుల్లో నమ్మకం పూర్తిగా సన్నగిల్లుతుందని దీప్కే పేర్కొన్నారు.

**జూన్ 20న జంతర్ మంతర్ వద్ద నిరసన ప్రదర్శన**

ఇదిలా ఉండగా, జూన్ 20న కాక్రోచ్ జనతాపార్టీ రెండోసారి తన నిరసన ప్రదర్శనను చేపట్టనుంది. ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద తన నిరసనలను కొనసాగించనుంది. ఇందుకోసం దేశవ్యాప్తంగా ఉన్న విద్యార్థులు, యువత పెద్ద ఎత్తున హాజరుకావాలని పిలుపునిచ్చింది. అంతకుముందు, జూన్ 6న చేపట్టిన నిరసన కార్యక్రమంలో వందలాది మంది విద్యార్థులు పాల్గొన్నారు. పరీక్షలు, నియామక పరీక్షల్లో జరిగిన అవకతవకల ఆరోపణలపై ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. అయితే, మొదటి నిరసనకు మంచి స్పందన రావడంతో, ప్రస్తుతం ఉద్యమాన్ని దేశంలోని ఇతర నగరాలకు కూడా విస్తరించాలని సీజేపీ యోచిస్తోంది.

**నిరసన ప్రదర్శనలో దీప్కేపై దాడి**

ఇదిలా ఉండగా, కొద్దిరోజుల క్రితం అభిజీత్ దీప్కేపై గుర్తుతెలియని వ్యక్తులు దాడి చేశారు. జైపూర్‌లో నిరసన కార్యక్రమంలో అతడు ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తుండగా, కొందరు వ్యక్తులు అతడి వద్దకు దూసుకువచ్చారు. దీప్కే మద్దతుదారులు ఆయనను తమ భుజాలపైకి ఎత్తుకున్న సమయంలో, గుంపులో ఉన్న కొందరు అభిజీత్ చెంపపై కొడుతూ, దాడికి పాల్పడ్డారు. దీంతో అక్కడే ఉన్న సీజేపీ కార్యకర్తలు వెంటనే స్పందించి, దీప్కేను కొట్టిన వ్యక్తులపై మూకుమ్మడి దాడి చేశారు. దీంతో ఒక్కసారిగా ఆ ప్రాంతంలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. కాగా, ఆ ఘటనకు సంబంధించిన దృశ్యాలు సోషల్ మీడియాలో ఫుల్? వైరలయ్యాయి. అయితే, ఈ విషయంపై అభిజీత్ స్పందిస్తూ, భౌతిక దాడులు పిరికితనానికి నిదర్శమని చెప్పారు. ఇలాంటి దాడులకు భయపడేది లేదని, ప్రజా సమస్యలపై శాంతియుత మార్గంలో తమ గళాన్ని వినిపిస్తూనే ఉంటామని ఎక్స్ వేదికగా తెలిపారు. ఈ ఘటనతో ఆగ్రహానికి గురవ్వద్దని యువతకు సూచించారు. మరోవైపు, జైపూర్‌లోని అమరవీరుల స్మారక చిహ్నం వద్ద సీజేపీ నిరసన చేపట్టిన సమయంలో ఈ ఘటన జరిగినట్లు పోలీసులు పేర్కొన్నారు. అయితే, అభిజీత్‌పై దాడి చేసిన నిందితులు పరారీలో ఉన్నారని, వారి కోసం గాలింపు చర్యలు చేపట్టామని తెలిపారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని చెప్పారు.

# అహ్మదాబాద్ విమాన ప్రమాదంలో కొత్త ట్విస్ట్



గత ఏడాది జూన్ 12న అహ్మదాబాద్ విమానాశ్రయం నుంచి టేకాఫ్ అయిన కొద్ది క్షణాల్లోనే కుప్పకూలిన ఎయిర్ ఇండియా విమానం ఏఐ 171 ప్రమాదంపై కొత్త వివాదం రాజుకుంది. ఈ దుర్ఘటన పైలట్ ఆత్మహత్య వల్లే జరిగిందన్న అధికారిక వాదనను ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ పైలట్స్ (ఎఫ్ఐపీ) తీవ్రంగా సవాల్ చేసింది. ఇది ఆత్మహత్య కాదని, విమానంలో తలెత్తిన భారీ విద్యుత్ వైఫల్యం వల్లే ప్రమాదం జరిగిందని, అందుకు తమ వద్ద తిరుగులేని సాంకేతిక ఆధారాలున్నాయని స్పష్టం చేసింది. ఈ మేరకు ఎఫ్ఐపీ అధ్యక్షుడు కెప్టెన్ సి.ఎస్. రంధావా మీడియా సమావేశంలో సంచలన విషయాలు వెల్లడించారు. ప్రభుత్వ దర్యాప్తు సంస్థల మధ్యంతర నివేదిక ప్రకారం... ఓ పైలట్ ఉద్దేశపూర్వకంగా ఇంధన సరఫరాను నిలిపివేయడంతో విమానం కూలిపోయిందని పేర్కొన్నారు. ఇంధన సరఫరా నిలిచిన కేవలం 4 సెకన్లలోనే విమానంలోని అత్యవసర విద్యుత్ వ్యవస్థ అయిన 'రామ్ ఎయిర్ టర్బైన్' (ఆర్ఏటీ) యాక్టివేట్ అయిందని నివేదిక తెలిపింది. అయితే, ఈ వాదనను ఎఫ్ఐపీ పూర్తిగా తోసిపుచ్చింది. ప్రమాద సమయంలోని బరువు, వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా తాము నిర్వహించిన సిమ్యులేటర్ పరీక్షల్లో భిన్నమైన ఫలితాలు వచ్చాయని రంధావా తెలిపారు. "మా సిమ్యులేటర్ పరీక్షల ప్రకారం పైలట్లు ఇంధన సరఫరాను మాన్యువల్‌గా నిలిపివేస్తే, బ్యాకప్ టర్బైన్ పనిచేయడానికి కనీసం 18 సెకన్ల సమయం పడుతుంది. కానీ, అధికారిక నివేదికలో చెప్పినట్లు కేవలం 4 సెకన్లలోనే అది యాక్టివేట్ కావడం భౌతికంగా, సాంకేతికంగా అసాధ్యం" అని ఆయన వివరించారు. విమానంలో ఒక్కసారిగా భారీ విద్యుత్ వైఫల్యం సంభవించడం వల్లే బ్యాకప్ టర్బైన్ అంత వేగంగా పనిచేయడం మొదలుపెట్టిందని, ఆ తర్వాతే ఇంజిన్ స్విచ్‌లు ట్రిప్ అయ్యాయని ఎఫ్ఐపీ వాదిస్తోంది. ఈ వాదనకు బలం చేకూరుస్తూ మరిన్ని ఆధారాలను ఎఫ్ఐపీ తెరపైకి తీసుకువచ్చింది. ప్రమాదం నుంచి ప్రాణాలతో బయటపడిన ఏకైక ప్రయాణికుడు, విమానం కిందకు పడిపోవడానికి ముందు క్యాబిన్‌లోని లైట్లు మిణుకుమిణుకుమన్నాయని చెప్పిన విషయాన్ని గుర్తుచేసింది. ఇది విద్యుత్ వైఫల్యం వాదనకు సరిగ్గా సరిపోతుందని పేర్కొంది. అంతేకాకుండా ప్రమాదానికి గురైన విమానంలో గతంలోనూ పలుమార్లు విద్యుత్ సంబంధిత సమస్యలు తలెత్తినట్లు రికార్డులు ఉన్నాయని సమాఖ్య తెలిపింది. దర్యాప్తు తీరుపై కూడా ఎఫ్ఐపీ తీవ్ర ఆరోపణలు చేసింది. భారత్‌లో అత్యుత్తమ బోయింగ్ 787 నిపుణుడిగా పేరున్న కెప్టెన్ ఆర్.ఎస్. సంధును ఉద్దేశపూర్వకంగానే దర్యాప్తు పరీక్షల నుంచి తప్పించారని రంధావా ఆరోపించారు. "ఆయనకున్న పరిజ్ఞానంతో 'పైలట్ సూసైడ్' థియరీ తప్పని తేలిపోతుంది. అందుకే ఆయన్ను పక్కనపెట్టారు. చనిపోయిన పైలట్లు తమను తాము సమర్థించుకోలేరు కాబట్టి, వారిపై నిందలు వేయడం సులభం. కానీ, విమానంలోని యాంత్రిక లేదా సాఫ్ట్‌వేర్ లోపాన్ని అంగీకరించడం ఇష్టం లేకే ఈ కుట్ర చేస్తున్నారు" అని రంధావా ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో తమ సిమ్యులేటర్ డేటాను, పరిశోధన ఫలితాలను బోయింగ్ సంస్థకు, ప్రభుత్వ ఏవియేషన్ అధికారులకు సమర్పించినట్లు ఎఫ్ఐపీ ధ్రువీకరించింది. టర్బైన్ యాక్టివేషన్ సమయంపై ఉన్న సాంకేతిక వైరుధ్యాలపై పూర్తిస్థాయిలో దర్యాప్తు జరిపే వరకు ప్రమాద తుది నివేదిక ప్రచురణను తక్షణమే నిలిపివేయాలని డిమాండ్ చేసింది. పారదర్శక దర్యాప్తు కోసం కెప్టెన్ సంధును వెంటనే విచారణ బృందంలో తిరిగి చేర్చుకోవాలని కోరింది. ఎఫ్ఐపీ చేసిన ఈ ఆరోపణలతో విమాన ప్రమాద దర్యాప్తు మరోసారి కీలక మలుపు తీసుకుంది.

## రాజ్యసభలో పెరుగుతున్న బీజేపీ బలం..

కేంద్రంలో వరుసగా మూడోసారి అధికారంలోకి వచ్చిన భారతీయ జనతా పార్టీ నేతృత్వంలోని ఎన్డీఏ కూటమి ఇప్పుడు రాజ్యసభలోనూ తన బలాన్ని మరింత పెంచుకుంటున్నట్లు రాజకీయ వర్గాలు విశ్లేషిస్తున్నాయి. ఇటీవల జరిగిన రాజ్యసభ ఎన్నికల ఫలితాలు ఎన్డీఏకు అనుకూలంగా రావడంతో, ఆ కూటమి సంఖ్యాబలం గణనీయంగా పెరిగింది. దీంతో భవిష్యత్తులో కీలక బిల్లులను ఆమోదించుకునే దిశగా బీజేపీ మరింత బలపడుతున్నట్లు కనిపిస్తోంది. జూన్ 18 వరకు దేశంలోని 10 రాష్ట్రాల్లో 27 రాజ్యసభ స్థానాలకు ఎన్నికలు జరిగాయి. వీటిలో ఎక్కువ స్థానాలు ఎన్డీఏ ఖాతాలోకి వెళ్లాయి. తొలుత ఏకగ్రీవంగా ఎన్నికైన 24 మంది సభ్యుల్లో 19 మంది ఎన్డీఏ కూటమికి చెందినవారు కాగా, జార్ఖండ్‌లో జరిగిన ఎన్నికలో పరిమల్ నత్వానీ విజయం సాధించడంతో ఆ సంఖ్య 20కి చేరింది. ప్రస్తుతం రాజ్యసభలో ఎన్డీఏ కూటమి మొత్తం బలం 152 స్థానాలకు చేరినట్లు రాజకీయ వర్గాలు అంచనా వేస్తున్నాయి. ముఖ్యంగా రాజ్యాంగ సవరణలకు అవసరమైన మూడింట రెండు వంతుల మెజారిటీకి ఎన్డీఏ కేవలం 11 సీట్ల దూరంలో ఉండటం విశేషం. దీంతో భవిష్యత్తులో రాజ్యాంగ సవరణలకు సంబంధించిన కీలక బిల్లులను సులభంగా ఆమోదించే అవకాశం ఏర్పడవచ్చని విశ్లేషకులు భావిస్తున్నారు. ఇక పశ్చిమ బెంగాల్ రాజకీయాల్లో చోటుచేసుకుంటున్న పరిణామాలు కూడా ఎన్డీఏకు కలిసి వచ్చే అవకాశాలు కనిపిస్తున్నాయి. తృణమూల్ కాంగ్రెస్‌కు చెందిన నలుగురు రాజ్యసభ సభ్యులు రాజీనామా చేయడంతో ఆ స్థానాలపై చర్చ మొదలైంది. భవిష్యత్తులో మరికొంతమంది ఎంపీలు కూడా పార్టీని వీడే అవకాశం ఉందనే ప్రచారం సాగుతోంది. అలాంటి పరిస్థితి ఏర్పడితే, ఆ ఖాళీ స్థానాలను బీజేపీ దక్కించుకునే అవకాశాలు ఉన్నాయని రాజకీయ పరిశీలకులు అభిప్రాయపడుతున్నారు. అదే సమయంలో బిజూ జనతా దళ్ (బీజేడీ), వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ (వైఎస్సార్‌సీపీ) వంటి పార్టీలు అధికారికంగా ఏ కూటమిలోనూ లేకపోయినా, పలు కీలక సందర్భాల్లో ఎన్డీఏకు మద్దతు ఇస్తూ వచ్చాయి. బీజేడీకి ఐదుగురు, వైఎస్సార్‌సీపీకి ఏడుగురు రాజ్యసభ సభ్యులు ఉండటం కూడా ఎన్డీఏకు అదనపు బలంగా మారే అవకాశం ఉంది.

ఇక కాంగ్రెస్ నేతృత్వంలోని ప్రతిపక్ష భారత కూటమి బలం తగ్గుతున్నట్లు కనిపిస్తోంది. డీఎంకే, ఆమ్ ఆద్మీ పార్టీ వంటి మిత్రపక్షాలు దూరం కావడంతో ఆ కూటమి సంఖ్య 64 మంది సభ్యుల వద్దే నిలిచిపోయింది. ఈ నేపథ్యంలో రాజ్యసభలో ఎన్డీఏ ఆధిపత్యం మరింత పెరిగే అవకాశం ఉందని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. రాబోయే పార్లమెంట్ సమావేశాలు దేశ రాజకీయాల్లో కీలక మలుపు తిప్పే అవకాశాలు ఉన్నాయని భావిస్తున్నారు.

## అమెరికా-ఇరాన్ చర్చలు వాయిదా..



అమెరికా, ఇరాన్ మధ్య స్విట్జర్లాండ్‌లో జరగాల్సిన కీలక చర్చలు వాయిదా పడ్డాయి. ఈ చర్చల్లో ఖతార్, పాకిస్థాన్ కూడా పాల్గొనాల్సి ఉంది. ఈ విషయాన్ని స్విట్జర్లాండ్ విదేశాంగ శాఖ శుక్రవారం అధికారికంగా ప్రకటించింది. చర్చల నిర్వహణకు తాము సిద్ధంగా ఉన్నామని, దానికి సంబంధించిన సన్నాహక పనులు కొనసాగుతున్నాయని తెలిపింది. ప్రస్తుతానికి దీనిపై మరింత సమాచారం ఇవ్వలేమని పేర్కొంది. మరోవైపు, ఇరాన్‌తో సాంకేతిక చర్చల కోసం అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ చేపట్టాల్సిన పర్యటన వాయిదా పడినట్టు వైట్‌హౌస్ వెల్లడించింది. అయితే, చర్చల కోసం సన్నాహాలు కొనసాగుతున్నాయని, ఇటీవల కుదిరిన అవగాహన ఒప్పందం అమలు లక్ష్యంగా తదుపరి దశ చర్చలు ప్రారంభించడంపై ఇరుపక్షాలు దృష్టి సారించాయని తెలిపింది. "లాజిస్టిక్స్ పరమైన అంశాలు ఎప్పుడూ సులభంగా ఉండవు" అని వైట్‌హౌస్ ప్రతినిధి పేర్కొన్నారు. అంతకుముందు, వైట్‌హౌస్‌లో మాట్లాడిన వాన్స్.. ఈ వారాంతంలోనే చర్చలు ప్రారంభం కావచ్చని అంచనా వేశారు. అయితే, ఇరాన్ నుంచి ప్రతినిధులు బయటకు రావడం అంత సులభం కాదని, సమన్వయం సవాలుగా మారిందని ఆయన అంగీకరించారు. అమెరికా బృందానికి తానే నాయకత్వం వహించనున్నట్టు స్పష్టం చేశారు. ఇప్పటికే కుదిరిన రాజకీయ ఒప్పందాన్ని ఆచరణలో పెట్టడం, దాని అమలు, పర్యవేక్షణ, నిబంధనలపై స్పష్టత కోసం ఈ చర్చలు జరగాల్సి ఉంది. "మేము మాటలను నమ్మం. చేతలను, ప్రవర్తనను మాత్రమే విశ్వసిస్తాం" అని వాన్స్ పేర్కొంటూ, చర్చల్లో అమెరికా వైఖరి ఎలా ఉండబోతోందో స్పష్టం చేశారు. ప్రస్తుతానికి కొత్త షెడ్యూల్‌ను ప్రకటించనప్పటికీ, వీలైనంత త్వరగా చర్చలు ప్రారంభించాలని అధికారులు భావిస్తున్నారు.

## మేకెదాటు డ్యామ్‌కు వ్యతిరేకంగా తమిళనాడు అసెంబ్లీ ఏకగ్రీవ తీర్మానం



కావేరీ నదీ జలాల పంపిణీ విషయంలో కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల మధ్య దశాబ్దాలుగా సాగుతున్న వివాదం.. 'మేకెదాటు డ్యామ్' ప్రతిపాదనతో మరోసారి తీవ్రరూపం దాల్చింది. కర్ణాటక ప్రభుత్వం కావేరీ నదిపై మేకెదాటు వద్ద కొత్త డ్యామ్ నిర్మాణానికి జరుపుతున్న ప్రయత్నాలను తీవ్రంగా వ్యతిరేకిస్తూ ఈ ఉదయం తమిళనాడు అసెంబ్లీలో ముఖ్యమంత్రి విజయ్ ఒక కీలక తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. ఈ తీర్మానానికి అధికార పక్షంతో పాటు కాంగ్రెస్, వీసీకే, ఇతర రాజకీయ పక్షాలు పూర్తి మద్దతు ప్రకటించడంతో అసెంబ్లీ దీనిని ఏకగ్రీవంగా ఆమోదించింది. అసెంబ్లీలో తీర్మానాన్ని ప్రవేశపెట్టిన సందర్భంగా విజయ్ మాట్లాడుతూ... కర్ణాటక ప్రభుత్వం ప్రతిపాదిస్తున్న మేకెదాటు ప్రాజెక్ట్ చట్ట విరుద్ధమని పేర్కొన్నారు. ఈ ప్రాజెక్ట్ కావేరి నదీ జలాల వివాదాల ట్రైబ్యునల్ ఇచ్చిన తుది అవార్డుతో పాటు, ఈ విషయమై గతంలో దేశ సర్వోన్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పులను పూర్తిగా ఉల్లంఘిస్తోందని ఆయన స్పష్టం చేశారు. ఈ డ్యామ్ నిర్మాణం గనుక చేపడితే దిగువన ఉన్న తమిళనాడులోని కావేరి డెల్టా పరివాహక ప్రాంత రైతాంగం తీవ్రంగా నష్టపోతుందని, వారి జీవనాధారం దెబ్బతింటుందని ఆందోళన వ్యక్తం చేశారు. కాబట్టి, కేంద్ర ప్రభుత్వం ఈ ప్రాజెక్టుకు సంబంధించి ఎలాంటి పర్యావరణ, సాంకేతిక అనుమతులు మంజూరు చేయకూడదని తీర్మానం ద్వారా డిమాండ్ చేశారు. ఈ అసెంబ్లీ తీర్మానానికి ముందే, గత నెలలో విజయ్ ఢిల్లీలో ప్రధాని నరేంద్ర మోదీతో సమావేశమయ్యారు. మేకెదాటు వద్ద డ్యామ్ నిర్మాణాన్ని తక్షణమే అడ్డుకోవాలని కోరుతూ ఆయనకు ఒక సమగ్ర వినతి పత్రాన్ని సమర్పించారు. కావేరి నదీ జలాల నిర్వాహక మండలిలో సభ్యులుగా ఉన్న ఇతర బేసిన్ రాష్ట్రాల (తమిళనాడు, కేరళ, పుదుచ్చేరి) రాతపూర్వక అనుమతి, ఆమోదం లేకుండా కర్ణాటక ఏకపక్షంగా మేకెదాటు ప్రాజెక్టును చేపట్టడానికి వీల్లేదని విజయ్ ప్రధానికి వివరించారు. ఈ విషయమై కర్ణాటకకు ఎలాంటి అనుమతులు ఇవ్వవద్దని కేంద్ర జలశక్తి శాఖకు, కేంద్ర నీటి వనరుల శాఖకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేయాలని ఆయన ప్రధాని మోదీని అభ్యర్థించారు. తమిళనాడు సెంటిమెంట్‌తో ముడిపడి ఉన్న ఈ సున్నితమైన అంశంపై అసెంబ్లీలో ఏకగ్రీవ తీర్మానం చేయడంతో ఇప్పుడు బంతి కేంద్ర ప్రభుత్వం పరిధిలోకి వెళ్లింది.

# నియోజకవర్గ పరిధిలో భూ, రెవెన్యూ వివాదాల పరిష్కారం పై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలి.

- గ్రీవెన్స్ దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలి.
- క్షేత్ర స్థాయిలో సమస్యలు పరిష్కరించకుంటే సంబంధిత అధికారుల పై చర్యలు తప్పవు.
- జిల్లా కలెక్టర్ విజయ క్రిష్ణన్.







**చోడవరం, పెన్ సత్తా, జూన్ 19:** నియోజకవర్గ పరిధి లోని భూ సమస్యలు, రెవెన్యూ వివాదాల పరిష్కారం పై అధికారులు ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని, ప్రజల నుంచి వచ్చిన అర్జీలను క్షేత్రస్థాయిలో పరిశీలించి త్వరితగతిన పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ విజయ క్రిష్ణన్ స్పష్టం చేశారు. క్షేత్ర స్థాయిలో సమస్యలు పరిష్కరించకుంటే సంబంధిత అధికారుల పై చర్యలు తప్పవని హెచ్చరించారు. శుక్రవారం ఉదయం చోడవం నియోజకవర్గం, చోడవరం మండలం, కొత్తూరు జంక్షన్ లో మాధవ ఫంక్షన్ హాల్ లో ఒక నెల– ఒక నియోజక వర్గం– నాలుగు సందర్శనలు కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ విజయ క్రిష్ణన్, చోడవరం శాసనసభ్యులు కె.ఎస్.ఎన్.ఎస్ రాజు తో కలసి ప్రారంభించారు. అనంతరం జిల్లా కలెక్టర్ విజయ క్రిష్ణన్ మాట్లాడుతూ ప్రజా సమస్యలను శీఘ్రగతిన పరిష్కారం, రెవెన్యూ శాఖలో పారదర్శకతను పెంచడమే లక్ష్యంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన కార్యక్రమం ఒక నెల -- ఒక నియోజకవర్గం -- నాలుగు పర్యటనలు కార్యక్రమాన్ని జిల్లాలో నిర్వహించడం జరిగిందన్నారు. ప్రజల నుంచి వచ్చిన అర్జీలను క్షేత్రస్థాయిలో పరిశీలించి త్వరితగతిన పరిష్కరించాలని అధికారులకు స్పష్టం చేశారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వస్తున్న అర్జీలపై అధికారులు వ్యవహరిస్తున్న తీరుపై జిల్లా కలెక్టర్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. వివిధ శాఖల పరిధిలో పెండింగ్‌లో ఉన్న పిటిషన్లపై నిశితంగా సమీక్షించిన కలెక్టర్, బాధ్యతాయుత మైన పదవుల్లో ఉండి క్షేత్రస్థాయిలో ఏం పని చేస్తున్నారంటూ హెచ్‌ఓడీల పై ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజా సమస్యల వేదికకు ప్రజలు ఇంత పెద్ద సంఖ్యలో రావడానికి ప్రధాన కారణం, క్షేత్రస్థాయిలో అధికారులు వారికి సమస్యల పైన సరైన అవగాహన కల్పించకపోవడమేనని కలెక్టర్ అభిప్రాయపడ్డారు. ఏదో ఒక సమాధానం చెప్పి దరఖాస్తులను ముగించడం కాకుండా, సమస్యలను శాశ్వతంగా, చట్టబద్ధంగా పరిష్కరించడమే ఈ కార్యక్రమం యొక్క ముఖ్య ఉద్దేశమని, అధికారులు దీనిని గమనించి బాధ్యతాయుతంగా వ్యవహరించాలని కలెక్టర్ తెలిపారు.

ఈ సందర్భంగా చోడవరంలో నిర్వహించిన సమీక్షా సమావేశంలో వ్యవసాయ శాఖ, పశు సంవర్ధక శాఖ, డ్వామా, బీసీ వెల్ఫేర్, విద్యుత్ శాఖ, హౌసింగ్, పౌర సరఫరాలు, కో–ఆపరేటివ్, డి సి హెచ్ ఎస్, ఎన్టీఆర్ వైద్య సేవ, ఎండోమెంట్, వైద్య ఆరోగ్య శాఖ, ఫిషరీస్, మైనింగ్, పంచాయతీరాజ్, ఎక్సైజ్ శాఖ, రిజిస్ట్రేషన్లు, డి ఆర్ డి ఏ, ఆర్ డబ్ల్యు ఎస్ శాఖలకు సంబంధించి వచ్చిన అర్జీలు, పరిష్కరించిన అర్జీలు, మిగిలిన దరఖాస్తులు ఎప్పటిలోగా పరిష్కరించాలి అనే విషయాల పై సమీక్ష నిర్వహించి అధికారులకు దిశా నిర్దేశం చేశారు. కొన్ని మండలాల్లో గ్రీవెన్స్ దరఖాస్తుల పరిష్కార ప్రగతి బాగుందని, అయితే మరికొన్ని మండలాల్లో ఇంకా పురోగతి సాధించాల్సి ఉందన్నారు. కొంతమంది అధికారులు పూర్తి సన్నద్ధతతో, నివేదికలతోరాగా, మరికొందరు ఆశించిన స్థాయిలో స్పందించకపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. జాయింట్ కలెక్టర్ శౌర్యమాన్ పటేల్ మాట్లాడుతూ.గత నాలుగు వారాలుగా చోడవరం నియోజకవర్గం లో వచ్చిన గ్రీవెన్స్ దరఖాస్తుల పరిష్కారానికి ఈ రోజుతో గడువు ముగుస్తున్నప్పటికీ, పెండింగ్ సమస్యల తీవ్రతను బట్టి మరో వారం రోజుల పాటు గడువును పొడిగిస్తున్నట్లు ప్రకటించారు. గడువు ముగిసినంత మాత్రాన పర్యవేక్షణ ఉండదని అనుకోవద్దని, ప్రతి ఒక్క దరఖాస్తు పూర్తిగా పరిష్కారమయ్యే వరకు ఈ ప్రక్రియ నిరంతరాయంగా కొనసాగుతుందని హెచ్చరించారు. గ్రీవెన్స్ పరిష్కారాలపై వారం, వారం సమీక్ష నిర్వహించడం జరుగుతుందని, ఇందుకోసం అధికారులు క్షేత్రస్థాయిలో బాధ్యతాయుతంగా వ్యవహరించాలన్నారు. ప్రజల నుండి వచ్చే ప్రతి సమస్యను మానవీయ కోణంలో పరిశీలించి, వీలైనంత త్వరగా వారికి న్యాయం జరిగేలా చూడాలని పిలుపునిచ్చారు. చోడవరం శాసనసభ్యులు కె. ఎస్.ఎన్.ఎస్ రాజు మాట్లాడుతూ చోడవరంలో గత నాలుగు వారాలుగా నిర్వహిస్తున్న ప్రత్యేక గ్రీవెన్స్ కార్యక్రమానికి ప్రజల నుండి అనూహ్య స్పందన లభించిందని, ఈ కార్యక్రమం అత్యంత విజయవంతంగా కొనసాగిందని వెల్లడించారు. మొదటి మూడు వారాల్లోనే 1,346 దరఖాస్తులు రాగా, నాలుగో వారమైన ఈ రోజు వచ్చిన వాటితో కలిపి మొత్తం దరఖాస్తుల సంఖ్య దాదాపు 1,800 కు చేరవచ్చని ఆయన తెలిపారు. గ్రామ, మండల, నియోజకవర్గ, డివిజన్ మరియు జిల్లా స్థాయి అధికారులందరి సమష్టి సహకారంతోనే ప్రజా సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని స్పష్టం చేశారు. చోడవరంలో మనం ఈ గ్రీవెన్స్ సెషన్స్ ఏర్పాటు చేసినప్పటి నుండి, రోలుగుంట వంటి అత్యంత మారుమూల ప్రాంతాల నుండి కూడా ప్రజలు ఎంతో నమ్మకంతో తరలివచ్చి తమ అర్జీలను సమర్పిస్తున్నారు. ఇక్కడికి వస్తే తమ సమస్యలు ఖచ్చితంగా పరిష్కారమవుతాయనే భరోసా వారిలో ఉంది. ఆ నమ్మకాన్ని అధికారులు, ప్రభుత్వం నిలబెట్టుకోవాలని అన్నారు. ఒక అప్లికేషన్ రాగానే కేవలం పుస్తకాల్లోని రూల్స్ చూసి, ఆ పని ఎందుకు అవ్వదో చెప్పే ప్రయత్నం కంటే, అధికారులు అదే రూల్స్ పరిధిలో ఆ పనిని ఎలా చేయవచ్చు, ప్రజలకు ఎలా న్యాయం చేయగలం అనే సానుకూల దృక్పథంతో పనిని పూర్తి చేయాలని కోరారు. గత నాలుగు వారాలుగా ఎంతో శ్రమకోర్చి, ఈ కార్యక్రమానికి హాజరవుతున్న జిల్లా కలెక్టర్ కి, జాయింట్ కలెక్టర్ కి, డిఆర్వో కి, అలాగే అనకాపల్లి, నర్సీపట్నం ఆర్డీఓ లకు ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతూ, క్షేత్రస్థాయి, గ్రామ స్థాయి నుండి వచ్చి సహకరిస్తున్న ప్రతి ఒక్క అధికారికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ శౌర్య మాన్ పటేల్, ఇన్చార్జి డి ఆర్ ఓ, వై. శ్రీనివాసరావు, ఆర్డీవోలు ఆయేషా, వెంకట రమణ లు వివిధ విభాగాల జిల్లా స్థాయి అధికారులు ప్రజా సమస్యల పరిష్కార వేదికలో హాజరైనారు.

# నేడు జిల్లాలో 23 వ విడత అన్నదాత సుఖీభవ - పీఎం కిసాన్ నగదు పంపిణీ.

**జిల్లాలో అర్హులైన రైతు లబ్ధిదారులు 2,42,536 మంది.**

**అనకాపల్లి, పెన్ సత్తా, జూన్ 19:**
అన్నదాత సుఖీభవ - పీఎం కిసాన్ పథకం కింద 2026–27 సంవత్సరానికి సంబంధించిన తొలి విడత నగదు పంపిణీ కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వం జూన్ 20 శనివారం మధ్యాహ్నం 3 గంటలకు నిర్వహించనుంది. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం అందించే రూ.5,000, కేంద్ర ప్రభుత్వం పీఎం కిసాన్ కింద అందించే రూ.2,000 కలిపి అర్హులైన రైతుల ఖాతాల్లో మొత్తం రూ.7,000 జమ చేయబడుతుంది.

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పల్నాడు జిల్లా చిలకలూరిపేటలో కార్యక్రమాన్ని ప్రారంభించనుండగా, రాష్ట్ర వ్యాప్తంగా ప్రత్యక్ష ప్రసారం ఏర్పాటు చేశారు. ఇందులో భాగంగా అనకాపల్లి జిల్లాలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

మాడుగుల నియోజకవర్గంలో చీడికాడ విద్యుత్ కార్యాలయం సమీప మైదానంలో, చోడవరం నియోజకవర్గంలో రావికమతం ఎంపీడీవో కార్యాలయంలో, ఎలమంచిలి నియోజకవర్గంలో రాంబిల్లి మండలం నారాయణపురం జంక్షన్ సమీపంలోని శ్రీ లక్ష్మీ దేవుళ్ల కన్వెన్షన్‌లో కార్యక్రమాలు జరుగుతాయి.

పాయకరావుపేట నియోజకవర్గంలో ఎస్.రాయవరం మండలం సైతారు పేట గ్రామ పంచాయతీ కార్యాలయంలో, అనకాపల్లి నియోజకవర్గంలో కశింకోట ప్రభుత్వ ఆసుపత్రి సమీపంలోని కళ్యాణ మండపంలో, నర్సీపట్నం నియోజకవర్గంలో గోలుగొండ ఎంపీడీవో కార్యాలయంలో, పెందుర్తి నియోజకవర్గంలో సబ్బవరం శ్రీ సీతారామ కళ్యాణ మండపంలో కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.

ప్రజాప్రతినిధులు, రైతులు, మహిళా రైతులు, కౌలు రైతులు, జేఎల్‌జీ సభ్యులు, ఎఫ్‌పీఓ ప్రతినిధులు, వ్యవసాయ అనుబంధ శాఖల అధికారులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జిల్లా యంత్రాంగం కోరింది. పాయకరావుపేట నియోజకవర్గం, ఎస్.రాయవరం మండలం సైతారు పేట గ్రామ పంచాయతీ కార్యాలయంలో జరుగు కార్యక్రమానికి జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్, పాల్గొననున్నారు.

# దళితుల సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం సహించం.







**అర్జీల స్వీకరణ అనంతరం భూ సమస్యలపై క్షేత్రస్థాయి పరిశీలన**

**రాష్ట్ర ఎస్సీ కమిషన్ సభ్యులు రావాడ సీతారాం**

**పరవాడ, పెన్ సత్తా, జూన్ 19:** దళితుల హక్కుల పరిరక్షణ, సమస్యల సత్వర పరిష్కారానికి రాష్ట్ర ఎస్సీ కమిషన్ కట్టుబడి ఉందని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎస్సీ కమిషన్ సభ్యులు రావాడ సీతారాం పేర్కొన్నారు. అనకాపల్లి జిల్లా పరవాడ మండలం లోని ఎంఆర్ఓ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన దళితుల గ్రీవెన్స్ కార్యక్రమంలో ఆయన ప్రజల నుంచి అర్జీలు, ఫిర్యాదులు, వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దళితుల సమస్యలకు సంబంధించిన అర్జీలను బుట్టదాఖలు చేసినా, వాటి పరిష్కారంలో అధికారులు నిర్లక్ష్యం వహించినా సహించబోమని స్పష్టం చేశారు. ప్రజల నుంచి వచ్చిన ప్రతి అర్జీని క్షుణ్ణంగా పరిశీలించి సంబంధిత శాఖల అధికారులు వెంటనే చర్యలు తీసుకుని సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు. అనంతరం పరవాడ మండలం లోని వాడ చీపురుపల్లి వెస్ట్ గ్రామంలో దళితుల భూ సమస్యలకు సంబంధించి క్షేత్రస్థాయిలో పర్యటించారు. శివలంక నరసింహారావు, గడ్డం లక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు సంబంధిత భూములను పరిశీలించి బాధితుల నుంచి పూర్తి వివరాలు తెలుసుకున్నారు. భూ హక్కులు, రెవెన్యూ రికార్డులు, ఆక్రమణల అంశాలు మరియు దళిత కుటుంబాలు ఎదుర్కొంటున్న ఇబ్బందుల పై స్థానిక అధికారులతో చర్చించి సమాచారం సేకరించారు. దళితుల భూ సమస్యల పరిష్కారానికి అవసర మైన చర్యలను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించిన ఆయన, ఫిర్యాదుదారులకు న్యాయం జరిగేలా అన్ని విధాలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమం క్షేత్రస్థాయి పర్యటనలో స్థానిక ఎమ్మార్వో రత్నం, రెవెన్యూ అధికారులు, ప్రజాప్రతినిధులు, దళిత సంఘాల నాయకులు, గ్రామస్థులు, దళిత సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

## రిజిస్టర్డ్ భవన నిర్మాణ రంగ కార్మికులకు శుభవార్త.

**అనకాపల్లి, పెన్ సత్తా, జూన్ 19**: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము వారిచే ఆంధ్రప్రదేశ్ భవన, ఇతర నిర్మాణ రంగ కార్మిక సంక్షేమ మండలి సమర్పణలో నేషనల్ అకాడమీ అఫ్ కన్స్ట్రక్షన్ (ఎన్ఏసి) ద్వారా రిజిస్టర్డ్ భవన నిర్మాణ రంగ కార్మికులకు వివిధ నిర్మాణ సంబంధిత అంశాలలో ఉచితంగా నైపుణ్యాభివృద్ధి శిక్షణలు ఇవ్వబడుచున్నవి. ప్లంబింగ్, ఎలక్ట్రికల్, తాపీమేస్త్రి, సర్వేయింగ్ తదితర అంశాలలో ఈ ఉచిత శిక్షణలు 15 రోజులు, రెండు లేదా మూడు మాసములు శిక్షణ ఇవ్వబడుచున్నవి. శిక్షణ కావాలనుకున్నవారు తప్పనిసరిగా ఆంధ్రప్రదేశ్ భవన, ఇతర నిర్మాణ రంగ కార్మిక సంక్షేమ మండలి లో నమోదు కావలెను. 18 సంవత్సరముల నుండి 35 సంవత్సరముల వయస్సు కలవారు ఈ శిక్షణలకు అర్హులు. మన జిల్లాలో నేషనల్ అకాడమీ అఫ్ కన్స్ట్రక్షన్ నర్సీపట్నం వద్ద గల మాకవరపాలెం శిక్షణా కేంద్రం లో జరుగును. ఉచిత భోజన, వసతి సౌకర్యాలు ఏర్పాటు చేయబడును. శిక్షణానంతరం ప్రభుత్వ గుర్తింపు సర్టిఫికెట్, హాజరైన రోజుకి 300/- లు చొప్పున్న ( 15 రోజుల శిక్షణాలకు మాత్రమే) కార్మిక శాఖ వారు చెల్లిస్తారు. ఈ శిక్షణలకు స్త్రీలు కూడా అర్హులే. పూర్తి వివరాలకు ఈ దిగువ ఫోన్ నెంబర్ లలో సంప్రదించండి.
7780275922, 7780374625.

## ఉచిత కంటి వైద్య సేవలు ప్రజలకు చేరువ చేయడం అభినందనీయం.

- స్వచ్ఛంద సంస్థల సేవలు సమాజ ఆరోగ్యాభివృద్ధికి దోహదం చేస్తాయి.
- జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్



**అనకాపల్లి, పెన్ సత్తా, జూన్ 19:**
ప్రజలకు నాణ్య మైన వైద్య సేవలు అందించడంలో స్వచ్ఛంద సంస్థలు కీలక పాత్ర పోషిస్తున్నాయని జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్ అన్నారు. నర్సాపురం, పశ్చిమ గోదావరి జిల్లాకు చెందిన సెవెన్ ఆలివ్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో చీడికాడ మండలం కోణం గురుకుల పాఠశాలలో నిర్వహించిన ఉచిత నేత్ర వైద్య శిబిరంలో గుర్తించిన లబ్ధిదారులకు శుక్రవారం ఉచిత కళ్లద్దాలను పంపిణీ చేశారు.

కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్ ముందుగా కోణం గురుకుల పాఠశాలకు చేరుకుని భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం జాయింట్ కలెక్టర్ సౌర్యమాన్ పటేల్‌తో కలిసి పాఠశాల ఆవరణలో మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతగా కృషి చేయాలని సూచించారు. అనంతరం నిర్వహించిన కార్యక్రమంలో కలెక్టర్ విజయ కృష్ణన్, జాయింట్ కలెక్టర్ సౌర్యమాన్ పటేల్ చేతుల మీదుగా లబ్ధిదారులకు ఉచిత కళ్లద్దాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కంటి ఆరోగ్యం పై ప్రజల్లో అవగాహన పెంపొందించడంతో పాటు అవసరమైన వారికి ఉచిత వైద్య సేవలు అందించడం గొప్ప సామాజిక సేవ అని పేర్కొన్నారు. గత మే 30 వ తేదీన కోణం, అనకాపల్లిలో నిర్వహించిన ఉచిత నేత్ర వైద్య శిబిరంలో డాక్టర్ పావని కొలిపె (ఎం.డి., ఆప్తాల్మాలజీ), డాక్టర్ ప్రజ్ఞా ఆధ్వర్యంలో కోణం గురుకుల పాఠశాల విద్యార్థుల తల్లిదండ్రులకు సుమారు 200 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. అవసర మైన వారికి వైద్య సలహాలు, చికిత్స అందించడంతో పాటు సుమారు 60 మంది కళ్లద్దాలు అవసరమైన వారిని గుర్తించారు.

కోణం గురుకుల పాఠశాలలో గతంలో ప్రిన్సిపాల్‌గా పనిచేసిన జి. గ్రేస్, సెవెన్ ఆలివ్స్ ఫౌండేషన్ సభ్యులు, ట్రస్ట్ చైర్మన్ జి. రీటా ఆధ్వర్యంలో ఈ వైద్య శిబిరం నిర్వహించబడింది. శిబిరంలో గుర్తించిన వారందరికీ ఉచితంగా కళ్లద్దాలు అందజేయడం అభినందనీయమని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో చీడికాడ మండల తహసీల్దార్, ఎంపీడీవో, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారులు, ఇతర ప్రభుత్వ శాఖల అధికారులు, సిబ్బంది, సెవెన్ ఆలివ్స్ ఫౌండేషన్ ప్రతినిధులు, గురుకుల పాఠశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.ద

## యోగ పై విద్యార్థులకు అవగాహన.

- పాఠశాల హెచ్.ఎం ఆధ్వర్యంలో యోగ విన్యాసాలు



**కంచిలి పెన్ సత్తా, జూన్ 19:**
:మండలంలోని అర్జునాపురం మండల పరిషత్ పాఠశాలలో యోగాంధ్ర కార్యక్రమాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు.పాఠశాల హెచ్ఎం బి.కామేష్ రెడ్డి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు.పాఠశాల విద్యార్థులను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ యోగాతో అనేక ప్రయోజనాలు ఉన్నాయని, ప్రతిరోజు ఒక అర్ధగంట ఈ యోగా మరియు ధ్యానం చేయడం వల్ల మానసిక ప్రశాంతత చక్కటి ఆరోగ్యం లభిస్తాయని పేర్కొన్నారు. ప్రత్యేకంగా ఆయన వేసిన యోగాసనాలు అందర్నీ ఆకట్టుకున్నాయి.

## అర్ధనారీశ్వరి అలంకరణలో కనకదుర్గ అమ్మవారు





**అనకాపల్లి, పెన్ సత్తా, జూన్ 19**: గవరపాలెం శతకం పట్టు కనకదుర్గ అమ్మవారి ఆలయములో నవమి వార్షికోత్సవం సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకులు కే హరినారాయణ, కే శివకేశవ, ఉదయగిరి చంద్రశేఖర్ ఆధ్వర్యంలో ఆలయంలో వేడుకలు నిర్వహించారు. వేడుకలలో భాగంగా శుక్రవారం ఆలయ శాశ్వత చైర్మన్, నిర్వాహకులు కాండ్రేగుల నాయుడు భాగ్యలక్ష్మి దంపతుల సౌజన్యంతో కళ్యాణం సందర్భంగా అమ్మవారిని అర్ధనారీశ్వరిగా అలంకరణ చేశారు. ఉత్సవ విగ్రహాలకు మంగళ స్నానాలు చేయించారు. అనంతరం ఆలయం వద్ద దుర్గామల్లేశ్వర స్వామి కల్యాణం అశేష భక్తులు తో ఘనంగా జరిగింది. ఈ కల్యాణంలో పాల్గొన్న పెంటకోట వరాహ వెంకట సన్యాసి నాయుడు శాంతి, యల్లపు నాయుడు అనుపమ దంపతులు. ఈ కార్యక్రమంలో ఆలయ వ్యవస్థాపకులు పివి రమణ, ఆలయ ఉత్సవ కమిటీ చైర్మన్ భీమర శెట్టి వరాహ నూకరాజు, ఆలయ ఉత్సవ కమిటీ సభ్యులు, గౌరీపరమేశ్వరుల కమిటీ సభ్యులు, మరిదిమాంబ కమిటీ సభ్యులు, గౌరీ పరమేశ్వరి ప్రజాటెంట్ హౌస్, తదితరులు పాల్గొన్నారు.ద

## గౌరీ పరమేశ్వరుల 217 వ ఉంజల్ సేవ కార్యక్రమం.



**అనకాపల్లి, పెన్ సత్తా, జూన్ 19:**గౌరీ పంచాయతన దేవస్థానం నందు గౌరీ పరమేశ్వరుల శుక్రవారం 217 వ ఉంజల్ సేవ కార్యక్రమం ఘనంగా జరిగినది. ఈ కార్యక్రమమునకు దేవాలయ అర్చకులు అంపోలు గోపాల కృష్ణ శర్మ, పొందూరు సూర్యనారాయణ శాస్త్రి, వేదవిదు లైన పండితులచే నిర్వహించబడినది. ఈ ఉంజల్ సేవలో దొడ్డి లోక అప్పారావు లక్ష్మి, దొడ్డి గణేష్ అప్పల నాయుడు నందిని దంపతులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా

సాయి రమ్య వాగ్దాయ మ్యూజిక్ ఇన్నిట్యూట్ డి రంజిని బృంద సభ్యులచే భక్తి గీతాలాపన భక్తులను ఆకట్టుకున్నాయి. గౌరీ గీత మహిళా మండలి, సత్తెమ్మ తల్లి దేవస్థానం మహిళా మండలి, గౌరీ పరమేశ్వరి అమృత వర్షిని పెంతకం శెట్టి సుజాత పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధ్యక్షులు కర్రి సన్యాసి నాయుడు, కార్యదర్శి బొడ్డేడ రామ సత్యనారాయణ, కోశాధికారి శరగడం జగదీష్ , ఆళ్ళ మహాలక్ష్మి నాయుడు, మళ్ల సురేష్, ఆళ్ల ప్రసాద్, పాలకవర్గ సభ్యులు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొనడం జరిగింది.

## యోగాతో మానసిక ప్రశాంతత.

కళ్యాణి స్కూల్ ప్రిన్సిపల్ బిందు మాధవి.

**కవిటి పెన్ సత్తా, జూన్ 19 జూన్19:**ప్రపంచ యోగా(జూన్21) దినోత్సవ సందర్భంగా కవిటి శ్రీ కళ్యాణి ఇంగ్లీష్ మీడియం స్కూల్ లో ముందస్తుగా విద్యార్థులు శుక్రవారం ఉదయం కవిటి పురవీధుల గుండా యోగపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. పాఠశాలలో యోగాసనాల ప్రదర్శన చేసి అనంతరం ర్యాలీ నిర్వహించారు. ర్యాలీ చేసేటప్పుడు"యోగచేయండి,ఆరోగ్యాన్ని కాపాడుకోండి", "యోగాతో మానసిక ప్రశాంతత", అంటూ నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు.ఈ సందర్భంగా విద్యార్థులని ఉద్దేశించి ప్రిన్సిపల్ బిందు మాధవి మాట్లాడుతూ యోగాతో మానసిక ప్రశాంతతతో పాటు ఆరోగ్యాన్ని కాపాడటంలో ఉపయోగపడుతుందని ప్రతిరోజు ఒక గంట యోగ అభ్యాసం వలన మన శరీరంలో అన్ని క్రియలు పనిచేసి మానసిక ప్రశాంతత ఉంటుందని అన్నారు. ప్రతి ఒక్క విద్యార్థి మీ పేరెంట్స్ కు యోగా యొక్క విశిష్టత తెలియజేసి యోగా తాలూకా గొప్పతనాన్ని తెలియజేయాలని కోరారు. ఈనెల జూన్ 21వ తేదీన ప్రతి విద్యార్థి మీయొక్క కుటుంబ సభ్యులతో కలిసి యోగ ప్రదర్శన చేయాలని విద్యార్థులకు పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్రీదేవి, సంతోష్,అంజన,స్వాతి, అనిత మరియు ఇతర ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

# అగ్ని ప్రమాద బాధితులకు అండగా నిలిచిన చింతమనేని.





**దెందులూరు, పెన్ సత్తా, జూన్ 19:** మండలం లోని కాశీ కాలనీకి చెందిన వృద్ధురాలు తోట సోమమ్మ (75), ఆమె కుమార్తె చుక్కారమణ కి చెందిన ఇల్లు రేకుల షెడ్లో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా అగ్నిప్రమాదం సంభవించగా బాధితులు ఆర్థికంగా నష్టపోయారు. దీంతో సమాచారం అందుకున్న దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ ఘటనా ప్రాంతానికి చేరుకుని బాధితులను పరామర్శించారు. వారికి అండగా నిలుస్తూ తక్షణ సహాయంగా 10,000 ఆర్థిక సహాయాన్ని అందించడంతోపాటు ప్రభుత్వం తరపున 50 కేజీల బియ్యాన్ని, అదేవిధంగా ఎమ్మెల్యే చింతమనేని ఆధ్వర్యంలో నిత్యవసర వస్తువులను కూడా అందించి అండగా నిలిచారు. ఈ సందర్భంగా బాధితులు తమకు అండగా నిలిచిన దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ కి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో దెందులూరు సహకార సొసైటీ చైర్మన్ గారపాటి కొండయ్య చౌదరి, తెలుగు యువత అధ్యక్షులు మోతుకూరి నాని, రాష్ట్ర యాదవ కార్పొరేషన్ డైరెక్టర్ పెనుబోయిన మహేష్ యాదవ్, దెందులూరు గ్రామ పార్టీ అధ్యక్షులు బీసీ నాయకులు ఇప్పిలి వెంకటేశ్వరరావు, జిల్లా తెలుగుదేశం కమిటీ సభ్యులు తిలక్, దెందులూరు ఎమ్మార్వో బత్తిన సుమతి సహా పలువురు కూటమి నాయకులు పాల్గొన్నారు.





# సర్వజన ఆసుపత్రి అంటే ప్రజలకు భరోసా పెరిగేలా చర్యలు చేపట్టండి.





వైద్య అధికారులకు దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ సూచన.

**దెందులూరు, పెన్ సత్తా, జూన్ 19:** ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్ గా (ఎఫ్ఏసి) నూతనంగా బాధ్యతలు చేపట్టిన డాక్టర్ జి. శ్యామల శుక్రవారం ఉదయం దుగ్గిరాల్లోని క్యాంపు కార్యాలయంలో దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ ని మర్యాద పూర్వకంగా కలిసారు. ఏలూరు ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో అనాటమి విభాగం హెచ్వోడీగా పనిచేస్తున్న శ్యామల ని ఏలూరు ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్ గా నియమిస్తూ ప్రభుత్వం తాజాగా ఉత్తర్వులు జారీ చేసింది. ఈ సందర్భంగా దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ మాట్లాడుతూ ఏలూరు ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి అంటే ఎన్నో ఏళ్లుగా చుట్టుపక్కల అనేక గ్రామాల నుంచి ఎంతోమంది పేద మధ్య తరగతి ప్రజలు వైద్యం కోసం, అత్యవసర వైద్య సేవల కోసం ఎంతో నమ్మకంతో వస్తుంటారని, అయితే జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి మెడికల్ కళాశాలగా రూపాంతరం చెందిన తరువాత ఇక్కడ వైద్య సేవల కన్నా పేషంట్లను విజయవాడ గుంటూరుకు రిఫర్ చేస్తున్న ఘటనలే ఎక్కువగా జరుగుతున్నాయని తీవ్ర విమర్శలు ఎదుర్కొంటుందని అన్నారు. ఈ అంశాన్ని ఒక సవాలుగా తీసుకుని పేషెంట్లను రిఫర్ చేసి పంపించేయడం కాకుండా అటువంటి మెరుగైన వైద్య చికిత్సలను ఇక్కడే అందించి ప్రజలకు అండగా నిలిచే విధంగా, ఏలూరు జిల్లా ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి అంటే ప్రజలకు మరింత భరోసా కల్పించేలా కృషి చేయాలని చితమనేని సూచించారు.

# పచ్చదనం మనందరి ఆస్తి.. మొక్కల రక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత

- పాఠశాల ఆవరణలో మొక్కలు నాటి నీరు పోస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు
- కుసంగీ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు బి. ప్రసన్న వదన

**(టేక్మాల్ పెన్ సత్తా, జూన్ 19** మెదక్ జిల్లా టేక్మాల్ మండలం కుసంగి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమంలో భాగంగా ట్రీ ప్లాంటేషన్ డే ని ఘనంగా నిర్వహించారు. పాఠశాల ఆవరణలో పలు రకాల మొక్కలు నాటి నీరు పోశారు. మొక్కలు సంరక్షించే బాధ్యత ఒక్కొక్క విద్యార్థికి అప్పగించారు.ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు బి. ప్రసన్న వదన, జీవశాస్త్ర ఉపాధ్యాయులు రమావత్ శంకర్ మాట్లాడుతు పర్యావరణ సమతుల్యతకు ప్రతి ఒక విద్యార్థి మొక్కలు నాటి ప్రకృతిని కాపాడాలని పిలుపునిచ్చారు. అనంతరం విద్యార్థులకు పర్యావరణ పరిరక్షణ పై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు పాండురంగం, రమేష్ గౌడ్, సుభాష్, కళ్యాణి, మల్లేష్ గౌడ్ మరియు విద్యార్థులు పాల్గొన్నారు.



# వృద్ధాశ్రమంలో ఘనంగా రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలు..

సేవా కార్యక్రమాలే రాహుల్ గాంధీ కి నిజమైన పుట్టినరోజు కానుక

డిసిసి ప్రెసిడెంట్ అలెగ్జాండర్ సుధాకర్

**పల్నాడు జిల్లా నరసరావుపేట పెన్ సత్తా, జూన్ 19**: అఖిల భారత కాంగ్రెస్ కమిటీ (ఏఐసిసి) మాజీ అధ్యక్షులు, లోక్‌సభ ప్రతిపక్ష నాయకులు రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలను పల్నాడు జిల్లా కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో బుధవారం నరసరావుపేటలో సేవాభావంతో నిర్వహించారు. ఏపిసిసి అధ్యక్షురాలు వై.ఎస్. షర్మిల రెడ్డి దిశానిర్దేశంలో, జిల్లా డిసిసి ప్రెసిడెంట్ గర్నెపూడి అలెగ్జాండర్ సుధాకర్ ఆధ్వర్యంలో.. స్థానిక "అమ్మానాన్నల ప్రేమాలయం" వృద్ధాశ్రమంలో వృద్ధుల సమక్షంలో కేక్ కట్ చేసి రాహుల్ గాంధీ పుట్టినరోజు జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆశ్రమ వృద్ధులకు అలెగ్జాండర్ సుధాకర్ స్వయంగా భోజనాలు వడ్డించారు. ఈ సందర్భంగా డిసిసి ప్రెసిడెంట్ అలెగ్జాండర్ సుధాకర్ మాట్లాడుతూ.. నిరంతరం ప్రజా పక్షాన నిలిచే రాహుల్ గాంధీ ఆశయాలకు అనుగుణంగానే ఈ సేవా కార్యక్రమం చేపట్టామన్నారు. వై.ఎస్. షర్మిల రెడ్డి నాయకత్వంలో రాహుల్ గాంధీని దేశ ప్రధానమంత్రిని చేయడమే లక్ష్యంగా, రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి నిరంతరం కృషి చేస్తామని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమానికి సహకరించిన ఆశ్రమ వ్యవస్థాపకులు ధనుంజయ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు ప్రవీణ్, బ్రహ్మయ్య, రవి, రమేష్, శివ, ప్రేమ్, షారుక్, నాగరాజు మరియు పెద్ద సంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు.



## బ్రిడ్జి మరమత్తు పనులను పరిశీలించిన ఎస్పీ

- వాహనాదారులకు ఇబ్బంది కలగకుండా ట్రాఫిక్ మళ్లింపు





**భద్రాద్రి కొత్తగూడెం పెన్ సత్తా, జూన్ 19** ఇల్లందు క్రాస్ రోడ్ నుండి బొమ్మనపల్లి క్రాస్ రోడ్ మధ్యన గల లోతు వాగు గ్రామం వద్ద జాతీయ రహదారి (చీఎ-930గ్రా) పైన గల బ్రిడ్జ్ మరమ్మత్తు పనుల నేపథ్యంలో శుక్రవారం జిల్లా ఎస్పీ రోహిత్ రాజు అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఇల్లందు క్రాస్ రోడ్, బొమ్మనపల్లి క్రాస్ రోడ్, లోతు వాగు బ్రిడ్జి దగ్గర ట్రాఫిక్ మళ్లింపు ఏర్పాట్లను నిశితంగా తనిఖీ చేసి అధికారులకు పలు సూచనలు చేశారు. ట్రాఫిక్ మళ్లింపు వల్ల స్థానిక ప్రజలకు, ప్రయాణికులకు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా చర్యలు తీసుకోవాలని, మళ్లింపు పాయింట్ల వద్ద స్పష్టమైన సూచిక బోర్డులతో పాటు, బారికేడ్లను ఏర్పాటు చేయాలని సూచించారు. రాత్రి సమయాలలో రిఫ్లెక్టివ్ జాకెట్స్ ధరించి ట్రాఫిక్ మళ్లింపు చేయాలని సూచించారు. పనులను వేగంగా పూర్తి అయ్యేలా చూస్తూనే, ట్రాఫిక్ జామ్ కాకుండా స్థానిక ప్రజలకు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా పోలీస్ సిబ్బంది నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. మరమ్మత్తులు పూర్తి అయ్యేంతవరకు అధికారులు అందరు సమన్వయంతో పనిచేస్తూ త్వరితగతిన పనులు పూర్తి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కొత్తగూడెం డిఎస్పి ఆదినారాయణ, చుంచుపల్లి సిఐ వెంకటేశ్వర్లు, ట్రాఫిక్ ఎస్ఐ ప్రవీణ్, లక్ష్మీదేవిపల్లి ఎస్సై అఖిల, రైల్వే అధికారులు మరియు సిబ్బంది పాల్గొన్నారు.

## పెద్దమ్మతల్లికి ఘనంగా పంచామృతాభిషేకము





**పాల్వంచ పెన్ సత్తా, జూన్ 19** :శ్రీ కనకదుర్గ దేవస్థానము (పెద్దమ్మగుడి) నందు దేవస్థాన కార్యనిర్వహణాధికారి ఎ.విజయ్ కుమార్ ఆదేశముల మేరకు అమ్మవారికి పంచామృతములతో వైభవముగా అభిషేకము నిర్వహించరు. మేళతాళాలతో దేవస్థాన అర్చకులు, భక్తులు జన్మస్థలం వద్ద ఉన్న అమ్మవారికి పంచామృతాలు, పసుపు, కుంకుమ, గాజులు, హారతి సమర్పించి అనంతరం దేవాలయంలోని అమ్మవారి మూలవిరాట్కు పంచామృతాలతో అభిషేకం అనంతరం పంచ హారతులు, నివేదన, నీరాజన మంత్రపుష్పం తదితర పూజలు నిర్వహించారు.

## 23న సింగరేణి పరిరక్షణ సదస్సు

- సింగరేణి సంస్థలో జరుగుతున్న పరిణామాలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్
- పాల్గొనున్న మాజీ మంత్రి హరీష్ రావు
- సదస్సును విజయవంతం చేయండి:మిర్యాల రాజిరెడ్డి




**భద్రాద్రి కొత్తగూడెం పెన్ సత్తా, జూన్ 19**ఈనెల 23న కొత్తగూడెం కమ్మ సేవా సమితిలో సింగరేణి పరిరక్షణ సదస్సు నిర్వహిస్తున్నట్లు తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం అధ్యక్షుడు మిర్యాల రాజిరెడ్డి తెలిపారు. శుక్రవారం కొత్తగూడెం టీబీజీకేఎస్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో తెలిపారు . ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సింగరేణి సంస్థలో జరుగుతున్న పరిణామాల పైన పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ఆ సదస్సులో ప్రజల ముందు ఉంచుతామని స్పష్టం చేశారు. మెడికల్ బోర్డు ఎప్పుడు పెడతారని, 15 నెలలుగా ఎందుకు పెట్టలేదని ప్రశ్నించారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలు ఎందుకు అమలు చేయలేదన్నారు. అలాగే జులై, నవంబర్, మే లో జరిగిన అడ్వైస్డ్ రివ్యూ బోర్డు రిపోర్టును ఎందుకు విడుదల చేయలేదని అడిగారు. మారుపేరుల సమస్యకు పరిష్కారం చూపుతారా, 250 గజాల ఇళ్ల స్థలం ఇస్తారా లేదా అని రియంబర్స్మెంట్ ఉంటుందా లేదా అని పలు ప్రశ్నలు సంధించారు. 20 నుంచి 30 లక్షల వడ్డీ లేని రుణాలు ఏమయ్యాయి అని . ఈ అన్ని అంశాలపై ఈనెల 23న కొత్తగూడెం కమ్మ సేవాసమితిలో మాజీ మంత్రి తన్నీరు హరీష్ రావు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇస్తారని తెలిపారు . ఈ కార్యక్రమంలో ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, ఎమ్మెల్సీలు తక్కెళ్ళపల్లి రవీందర్రావు, తాత మధుసూదన్, జిల్లాలోని ఐదు నియోజకవర్గాల మాజీ ఎమ్మెల్యేలు, మాజీ ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ పార్టీ నాయకులు పాల్గొంటారని తెలిపారు.

# దొంగ ఐడీలు దొంగ ప్రేమలు

- ఇన్‌స్టాలో ఫేక్ ఐడీలతో యువతులకు వల
- ఇద్దరి నుంచి రూ.12 లక్షలు కొట్టేసిన యువకుడు
- ఇన్‌స్టాగ్రామ్‌లో ఫేక్ ఐడీతో ఓ యువకుడు యువతులను మోసం చేస్తున్న ఘటన
- వెలుగులోకి ఇద్దరు యువతులకు వలపు వల వేసిన ఆ యువకుడు
- నమ్మి మోసపోయామని పోలీసులను ఆశ్రయించిన యువతులు




**పెన్ సత్తా, జూన్ 19**మెదక్ జిల్లాలో ఏకంగా రూ.12 లక్షలు కొట్టేశాడు. ఆ యువతులకు మాయమాటలు చెప్పి.. వారి నుంచి డబ్బు, బంగారు ఆభరణాలు తీసుకున్నాడు. అయితే తాము మోసపోయామని గుర్తించిన బాధిత యువతులు.. పోలీసులను ఆశ్రయించడంతో ఈ వ్యవహారం వెలుగులోకి వచ్చింది. సోషల్ మీడియాలో తెలియని వాళ్ల నుంచి ఫ్రెండ్ రిక్వెస్ట్‌లు వస్తే వాటిని యాక్సెప్ట్ చేయవద్దని ఎన్నిసార్లు చెప్పినా కొంతమంది మాత్రం వినడం లేదు. దీంతో అనవసర విషయాల్లో వేలు పెట్టి.. మోసపోతున్నారు. ఇన్‌స్టాగ్రామ్‌లో తెలియని వ్యక్తి నుంచి వచ్చిన ఫ్రెండ్ రిక్వెస్ట్‌లు ఇద్దరు యువతులను ఆర్థికంగా మోసపోయేలా చేశాయి. ఓ వ్యక్తి.. ఫేక్ అకౌంట్‌తో వారికి ఫ్రెండ్ రిక్వెస్ట్‌లు పంపించి.. వారి వద్ద నుంచి భారీగా డబ్బులు, నగలు కాజేయగా.. మోసపోయామని గ్రహించి.. వారు ఫిర్యాదు చేయడంతో.. ఈ ఘటన బయటికి వచ్చింది. వారిద్దరి నుంచి మొత్తం రూ.12 లక్షలు మోసం చేసినట్లు తెలిపారు. మెదక్ జిల్లా టేక్మాల్ మండలం ఎల్లంపల్లి గ్రామానికి చెందిన కొండి స్వాతికి ఒక సంవత్సరం క్రితం ఇన్‌స్టాగ్రామ్‌లో రిత్విక్ రెడ్డి (=ఱ్షఱని =వ౧౧ఎ) అనే ఐడీ నుంచి ఫాలో రిక్వెస్ట్ వచ్చింది. దాన్ని ఆమె యాక్సెప్ట్ చేయగా.. క్రమంగా వారి మధ్య పరిచయం ఏర్పడింది. ఈ క్రమంలోనే ఆమెను ప్రేమిస్తున్నానని, పెళ్లి కూడా చేసుకుంటానని అతడు నమ్మించాడు. ఈ నేపథ్యంలోనే తాను ఐపీఎస్ ట్రైనింగ్ కోసం ఛత్తీస్‌గఢ్ వెళ్తున్నానని స్వాతికి చెప్పాడు. ఐపీఎస్ ట్రైనింగ్ పూర్తి అయిన తర్వాత పెళ్లి చేసుకుంటానని చెప్పాడు. కొన్ని రోజుల తర్వాత.. స్వాతికి ఫోన్ చేసిన ఆ కేటుగాడు.. తనకు అత్యవసరంగా డబ్బులు కావాలని అడిగాడు. తన ఫ్రెండ్ ఉప్పరి దుర్గేశ్ వస్తాడని.. అతడికి డబ్బులు ఇవ్వాలని ఆమెకు చెప్పాడు. అయితే అతడి మాటలు విన్న బాధితురాలు.. దశల వారీగా నగదు రూపంలో.. ఫోన్ పే ద్వారా మొత్తం రూ.5 లక్షలు ఇచ్చేసింది. వాటితోపాటు తన వద్ద ఉన్న బంగారు చెవి కమ్మలు కూడా ఉప్పరి దుర్గేశ్‌కి ఇచ్చేసింది. వాటి బరువు తులం ఉంటుందని బాధితురాలు తెలిపింది. అయితే డబ్బులు, బంగారం తీసుకుని వెళ్లిన తర్వాత అతడి నుంచి ఎలాంటి ఫోన్లు, మెసేజ్ రాలేదు. అలాగే వేచి చూసిన స్వాతి.. ఈ ఘటన జరిగి సంవత్సరం దాటడంతో ఆమెకు మోసపోయినట్లు అనుమానం వచ్చింది. ఈ క్రమంలోనే అతడు డబ్బుల కోసమే ఇలా చేశాడా అని అనుమానించిన స్వాతి.. తనలాగే ఇంకా ఎవరినైనా మోసం చేశాడా అని ఆరా తీయడంతో సంచలన విషయాలు వెలుగులోకి వచ్చాయి. టేక్మాల్ మండలం ఎక్లాస్‌పూర్ గ్రామానికి చెందిన 17 ఏళ్ల మరో యువతి కూడా ఇలాగే మోసపోయినట్లు తెలిసింది. ఇన్‌స్టాగ్రామ్‌లో సాత్విక్ రెడ్డి (ర్ఘ్ఫ్ఱ్షఱని =వ౧౧ఎ) అనే పేరుతో నకిలీ ఐడీ నుంచి ఆమెకు రిక్వెస్ట్ వచ్చింది. తాను ఎంబీబీఎస్ స్టూడెంట్ అని పరిచయం చేసుకున్న ఆ కేటుగాడు.. ఆమెకు డైమండ్ రింగ్ పంపిస్తున్నానని నమ్మించాడు. అయితే.. దాని కోసం టాక్స్ కట్టాలని పేర్కొన్నాడు. తన ఫ్రెండ్ దుర్గేశ్ వస్తాడని చెప్పి.. ఆమె వద్ద కూడా రూ.7 లక్షల నగదుతోపాటు.. ఒక తులం గోల్డ్ రింగ్ దుర్గేశ్ వసూలు చేశాడు. ఈ రెండు ఘటనల్లో ఉప్పరి దుర్గేశ్ కీలక పాత్ర పోషించినట్లు తేలింది. ఉప్పరి దుర్గేశే.. ఇన్‌స్టాగ్రామ్‌లో (రిత్విక్ రెడ్డి సాత్విక్ రెడ్డి). =ఱ్షఱని =వ౧౧ఎ', 'ర్ఘ్ఫ్ఱ్షఱని =వ౧౧ఎ' వంటి పేర్లతో ఫేక్ ఐడీలు క్రియేట్ చేసి.. మోసాలు చేసినట్లు వెల్లడైంది. తాను పెద్ద పెద్ద ఉద్యోగాలు చేస్తున్నట్లుగా యువతులను నమ్మించి.. వారిని పెళ్లి చేసుకుంటానని చెప్పి.. ఇద్దరు యువతులను మోసం చేసినట్లు పోలీసుల విచారణలో వెల్లడైంది. బాధితుల ఫిర్యాదులతో కేసు నమోదు చేసుకున్న టేక్మాల్ పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

## రెవెన్యూ అధికారులపై మహిళ దాడి.. పోలీసులకు ఫిర్యాదు..



**రంగారెడ్డి జిల్లా, అబ్దుల్లాపూర్మెట్, పెన్ సత్తా, జూన్ 19** అబ్దుల్లాపూర్‌మెట్ మండలం తుర్కయంజాల్‌లో రెవెన్యూ అధికారులపై ఓ మహిళ దాడి చేసిన ఘటన జరిగింది. వివాదాస్పద భూమి వ్యవహారంలో ఆర్డీవో, తహసీల్దార్ ఆదేశాల మేరకు విధులు నిర్వహించేందుకు వెళ్లిన రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ (ఆర్ఐ), జీపీఓలతో మహిళ వాగ్వాదానికి దిగారు. తుర్కయంజాల్‌లోని సర్వే నంబర్ 338లో ఉన్న 1810 గజాల భూమిపై వివాదం నెలకొనడంతో, ఆదిభట్ల సీఐ విజ్ఞప్తి మేరకు సంబంధిత భూమిని ప్రభుత్వాధీనంలోకి తీసుకోవాలని ఆర్డీవో ఆదేశాలు జారీ చేశారు. ఈ నేపథ్యంలో అబ్దుల్లాపూర్‌మెట్ రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ ప్రేమ్‌కుమార్, జీపీఓ హన్మంతు అక్కడికి వెళ్లగా, అక్కడ ఉన్న మహిళ అధికారులేనని నిరూపించాలంటూ ప్రశ్నిస్తూ వారితో ఘర్షణకు దిగింది. ఈ సందర్భంగా ఆర్ఐ ప్రేమ్‌కుమార్ గల్లా పట్టుకుని ఈడ్చుకెళ్లినట్లు, ఐడీ కార్డును లాక్కొని దుర్భాషలాడినట్లు అధికారులు ఆరోపించారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకే తాము విధులు నిర్వహించేందుకు వచ్చామని చెప్పినా వినకుండా దౌర్జన్యానికి పాల్పడినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. అలాగే కులం పేరుతో దూషించారని జీపీఓ హన్మంతు నాయక్ ఆరోపించారు. ఈ ఘటనపై ఆర్ఐ ప్రేమ్‌కుమార్, జీపీఓ హన్మంతు నాయక్ ఆదిభట్ల పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దాడి చేసిన మహిళపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.

**రెవెన్యూ అధికారులపై దాడులను నిరసిస్తూ పోలీస్ స్టేషన్ ముందు నిరసన..**

ఇదిలా ఉండగా, ఆర్ఐ, జీపీఓలపై జరిగిన దాడిని నిరసిస్తూ నాలుగు మండలాల నుంచి వచ్చిన రెవెన్యూ సిబ్బంది ఆదిభట్ల పోలీస్ స్టేషన్ ఎదుట నిరసన తెలిపారు. ప్రభుత్వ విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులపై దాడులను సహించబోమని హెచ్చరిస్తూ, నిందితురాలిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించినట్లు పోలీసులు వెల్లడించారు.

## ఆకేరు ఇసుక రీచ్ లపై అధికారుల ఆకస్మిక తనిఖీ

**అక్రమ ఇసుక తవ్వకాల నివారణ చర్యలు**





**నర్సింహులపేట పెన్ సత్తా, జూన్ 19**మహబూబాబాద్ జిల్లా నర్సింహులపేట మండల పరిధిలోని ఆకేరు వాగులో నిర్వహిస్తున్న ఇసుక రీచ్ లను రెవిన్యూ, పోలీసు, గనుల శాఖ అధికారులు సంయుక్తంగా శుక్రవారం తనిఖీ చేశారు. ఇసుక తవ్వకాల నిర్వహణ అనుమతుల ప్రకారం కార్యకలాపాల అమలు, స్టాకు నిర్వహణ, రవాణా విధానం, రికార్డుల నిర్వహణ తదితర అంశాలను అధికారులు పరిశీలించారు. అదేవిధంగా రీచ్ ల వద్ద భద్రతా ప్రమాణాలు పాటిస్తున్నారా లేదా అనే విషయాన్ని కూడా తనికి చేశారు. అక్రమ ఇసుక తవ్వకాలు, అనుమతులకు విరుద్ధంగా ఇసుక రవాణా చేపట్టే వారిపై కఠిన చర్యలు తప్పవని అధికారులు హెచ్చరించారు. ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా ఇసుక తవ్వకాలు రవాణా చేపట్టాలని నిర్వాహకులకు సూచించిన అధికారులు. ఆఖీరు వాగు పరిధిలో అక్రమ ఇసుక తవ్వకాలను పూర్తిగా అరికట్టేందుకు నిరంతర పర్యవేక్షణ కొనసాగిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో తొర్రూర్ ఆర్డీవో, సీఐ, గనులు భూగర్భజల శాఖ సహాయ సంచాలకులు, నర్సింహులపేట తాసిల్దార్ రమేష్ బాబు, ఎస్సై భానోత్ వెంకన్న లు పాల్గొన్నారు.

## కొల్లి ఫౌండేషన్ ఆధ్వర్యంలో సానిటరీ ప్యాడ్ల పంపిణీ




**కొత్తగూడెం పెన్ సత్తా, జూన్ 19** పాల్వంచ మండలంలోని జగన్నాథపురం ప్రభుత్వ జెడ్పి పాఠశాలలో చదువుతున్న బాలికలకు కొల్లి ఫౌండేషన్ ఆధ్వర్యంలో సానిటరీ ప్యాడ్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో కొల్లి ఫౌండేషన్ అధ్యక్షురాలు కల్పనా చౌదరి విద్యార్థినులకు సానిటరీ ప్యాడ్లను అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతు గత సంవత్సరాల్లో నిర్వహించిన పరిశీలనల్లో ఆడపిల్లలు పాఠశాల మానివేయడానికి (స్కూల్ డ్రాప్‌అవుట్) కారణమయ్యే అంశాలలో రుతుక్రమ పరిశుభ్రత మరియు ఆరోగ్య సంబంధిత సమస్యలు కూడా ఒకటిగా గుర్తించామని తెలిపారు. విద్యార్థినుల విద్యతో పాటు వారి ఆరోగ్యం, భద్రత పట్ల కూడా కొల్లి ఫౌండేషన్ అండగా ఉంటుందని భరోసా కల్పించారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఆడపిల్లల హాజరు శాతాన్ని పెంచడం, వారికి రుతుక్రమ పరిశుభ్రతపై అవగాహన కల్పించడం, విద్యను మధ్యలో నిలిపివేయకుండా ప్రోత్సహించడం లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు తెలిపారు. అలాగే విద్యార్థినులందరూ క్రమం తప్పకుండా పాఠశాలకు హాజరై, మంచి విద్యను అభ్యసించి, ఉత్తమ ఫలితాలు సాధించి తమ ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయ బృందం, కొల్లి ఫౌండేషన్ కోఆర్డినేటర్ రూప్లా నాయక్, విద్యార్థినులు, ఇతర ప్రముఖులు పాల్గొన్నారు.

# అట్లూరు సిద్ధవటం మధ్య బ్రిడ్జి నిర్మించాలి



అట్లూరు సిద్ధవటం అటవీ ప్రాంతంలో శ్రీశైలం మాలకొండల మాదిరి రోడ్డుకు ఇరువైపులా ఎత్తుగా ఫెన్సింగ్ నిర్మించాలని అలాగే, 20 కి పైగా గ్రామాల ప్రజల రవాణాకు సమస్యగా మారిన వేములూరు బ్రిడ్జి నిర్మాణానికి తక్షణమే నిధులు కేటాయించి పనులు ప్రారంభించాలని, అడవిలో సీసీ కెమెరాల ఏర్పాటు మరియు కలివికోడి ముసుగులో జరిగిన అక్రమాలు అవినీతి పై మరియు మండల పరిధిలో జరిగిన వేలాది ఎకరాల భూ ఆక్రమణలపై ఉన్నత స్థాయి విచారణ జరిపి బాధ్యులను కఠినంగా శిక్షించాలని సిపిఐ ఎంఎల్ లిబరేషన్ పార్టీ జిల్లా స్టాండింగ్ కమిటీ సభ్యులు ఎస్ చంద్రశేఖర్ డిమాండ్ చేశారు. ఒక నియోజకవర్గం నాలుగు పర్యటనల కార్యక్రమంలో భాగంగా శుక్రవారం నాడు అట్లూరులో జరిగిన రెవెన్యూ సదస్సులో పై సమస్యలపై ఆర్డీఓ ను కలిసి వినతి పత్రాలు సమర్పించడం జరిగింది. ఈ సందర్భంగా ఎస్ చంద్రశేఖర్ మాట్లాడుతూ, అట్లూరు సిద్ధవటం అడవి చెక్ పోస్ట్ కారణంగా ప్రజల ప్రాణాలు పోతున్నా పట్టించుకోరా ప్రజల ప్రాణాలు అంటే లెక్క లేదా కేవలం రెండు కోట్ల నిధులు విడుదల చేస్తే శ్రీశైలం, మాలకొండ అడవుల్లో నిర్మించిన విధంగా ఎత్తైన ఫెన్సింగ్ నిర్మించవచ్చని దీనిపై అధికారులు ఎందుకు దృష్టి పెట్టడం లేదు అని ప్రశ్నించారు. అడవిలో సీసీ కెమెరాల ఏర్పాటులో, కలివికోడి ముసుగులో 2008లో డిటి ఆంజనయ్య హయాంలో లక్షలాది రూపాయల నిధులు దారి మళ్ళాయని దీనిపై ఉన్నత స్థాయి విచారణ జరిపించి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. నల్లాయపల్లి, కమలకూరు రెవిన్యూ పరిధిలో కొంతమంది దొంగ పట్టాలు సృష్టించి 400 ఎకరాల పైబడి ప్రభుత్వ భూములను ఆక్రమించి పండ్ల తోటలు జామాయిల్ తోటలు వేశారని ఈ ఆక్రమణలు రెవెన్యూ అధికారుల కనుసన్నల్లోనే జరిగాయని ఆరోపణలు ప్రజల్లోఉన్నాయనిఇవిఉన్నతాధికారుల కంటికి కనిపించడం లేదా అని ప్రశ్నించారు. అట్లూరు మండలంలో వేరాది ఎకరాల భూములు ఇతర జిల్లాల వారి చేతుల్లో ఉన్నాయని స్థానికులు వందలాదిమంది అర్హులుగా ఉన్నప్పటికీ స్థానికులను పక్కనపెట్టి అధికారం ఆర్థిక అంగ బలం ఉన్న స్థానికేతరులకు భూములు కట్టబెడుతున్నారని వారు ఆరోపించారు. 2008 నుండి 2025 వరకు జరిగిన భూ ఆక్రమణలపై మరియు కలివికోడి ముసుగులో జరిగిన అక్రమాలు అవినీతిపై ఉన్నత స్థాయి విచారణ జరిపి అందుకు బాధ్యులైన సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. వర్షాకాలం వస్తే 20 కి పైగా గ్రామాల ప్రజల రవాణాకు సమస్యగా మారుతూ ప్రజల కంటతడి పెట్టిస్తున్న వేములూరు బ్రిడ్జి నిర్మాణానికి తక్షణమే నిధులు కేటాయించి పనులు ప్రారంభించాలని లేని పక్షంలో ఆయా గ్రామాల ప్రజలతో కలిసి పెద్ద ఎత్తున పోరాటాలకు సిద్ధమవుతామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు జకరయ్య నియోజకవర్గ కమిటీ సభ్యులు విజయరావు .కే బాబు గంటా మహబూబ్ బాషా ఎంఆర్పిఎస్ జిల్లా అధ్యక్షుడు శిఖామణి విప్లవ యువజన సంఘం నాయకులు ఈశ్వర్ సలీం తదితరులు పాల్గొన్నారు.

# ఎరువుల దుకాణాలను తనిఖీ చేసిన మండల వ్యవసాయ అధికారి మహేష్



ఖాన్,దకంబదూరు మండల కేంద్రంలోని ఎరువుల దుకాణాలను వ్యవసాయ అధికారి (ఏవో) మహేష్ శుక్రవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మన గ్రోమోర్, జై కిసాన్ ఎరువుల విక్రయ కేంద్రాలను పరిశీలించి డీలర్లకు పలు సూచనలు చేశారు. రైతులకు ప్రభుత్వం నిర్ణయించిన ఎంఆర్పీ ధరలకే ఎరువులను విక్రయించాలని, అధిక ధరలకు అమ్మకాలు జరిపితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రత్యేకంగా డీఏపీ, యూరియా వంటి ఎరువులను నిర్ణీత ధరలకు మించి విక్రయించరాదని స్పష్టం చేశారు. ఎరువుల కొనుగోలు, విక్రయాలకు సంబంధించిన వివరాలను తప్పనిసరిగా రికార్డుల్లో నమోదు చేయాలని సూచించారు. అలాగే ఏపీఏఐఎంఎస్ పోర్టల్ ద్వారా నమోదుచేసి విక్రయాలు నిర్వహించడంతో పాటు ఐఎఫ్ఎంఎస్ లో కూడా అన్ని వివరాలను నమోదు చేయాలని డీలర్లకు ఆదేశించారు. నిబంధనలను ఉల్లంఘించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించిన ఆయన, రైతుల పట్ల నిర్లక్ష్య ధోరణి తగదన్నారు. రైతులు వేలాది రూపాయల పెట్టుబడులు పెట్టి పంటలు సాగు చేస్తున్నారని, అలాంటి రైతన్నకు అండగా నిలవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. రైతులకు ఇబ్బందులు కలిగించే చర్యలకు పాల్పడకుండా పారదర్శకంగా వ్యవహరించాలని సూచించారు."దేశానికి రైతే వెన్నెముక. రైతుల సంక్షేమమే దేశ అభివృద్ధికి పునాది. రైతుల పట్ల సేవాభావంతో వ్యవహరించి వారికి అవసరమైన సహకారం అందించాలి" అని ఏవో మహేష్ పేర్కొన్నారు.

# ఆలయాలను ఆకస్మిక తనిఖీ చేసిన దేవాదాయ అసిస్టెంట్ కమిషనర్



అట్లూరు మండలంలోని పలు ఆలయాలను కడప దేవాదాయ అసిస్టెంట్ కమిషనర్ శంకర్ బాలాజీ శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. కొండూరు, కుంభగిరి, వేమలూరు, ముత్తుకూరు గ్రామాలలో ఉన్న ఆలయాలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆలయాలలో జరుగుతున్న పూజా కార్యక్రమాలు ధూపదీప నైవేద్య పథకం అమలు తీరును పరిశీలించారు మొదటగా కొండూరుగ్రామంలోనివేణుగోపాలస్వామి ఆలయాన్ని సందర్శించి స్వామివారిని దర్శనం చేసుకున్నారు. అనంతరం ఆలయ పరిసరాలు అపరిశుభ్రంగా కనిపించడంతో అసహనం వ్యక్తం చేశారు. ఈ ఆలయంలో ధూపదీప నైవేద్య పథకం కింద పూజారిగా ఎం. సురేష్ శర్మ విధులు నిర్వహిస్తున్నాడని గ్రామస్తులకు తెలియజేశారు ఈ సందర్భంగా గ్రామస్తులను పిలిపించి ఈ వేణుగోపాలస్వామి ఆలయం చాలా బాగుందని ఆలయంలో ప్రతినిత్యం కూడా పూజా కార్యక్రమాలు జరిగే విధంగా గ్రామస్తులు కూడా సహకరించాలని కోరారు. వేణుగోపాల స్వామి గుడిలో ప్రతిరోజూ ఉదయం 6 గంటల నుంచి 10 గంటల వరకు మధ్యాహ్నం 4 గంటల నుంచి రాత్రి 7 గంటల వరకు పూజారి ఆలయంలో ఉండి ప్రతిరోజు పూజలునిర్వహిస్థాదని గ్రామస్తులకు తెలిపారు ఈ పథకం కింద పూజారి వేతనం నైవేద్య ఖర్చులతో కలిపి నెలకు రూ.10 వేల ఆర్థిక సహాయం రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్నట్లు పేర్కొన్నారు. ఆలయంలో స్వామివారిని దర్శించుకున్న అనంతరం సహాయ కమిషనర్ ఆలయ పరిసరాలను పరిశీలించారు. దేవాలయం చుట్టూరా పరిసరాలు అపరిశుభ్రంగా కనిపించడంతో అసంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం గ్రామస్తులతో సమావేశమై ఆలయంలో నిత్య పూజలు నిరంతరాయంగా జరిగేలా సహకరించాలని కోరారు. దేవాలయం ముందు తప్పనిసరిగా సమాచార బోర్డు ఏర్పాటు చేయాలని సూచించారు ఆ బోర్డులో దేవస్థానం పేరు, దర్శన వేళలు, పూజారి పేరు, సెల్‌ఫోన్ నంబర్ తదితర వివరాలను పొందుపరచాలని ఆదేశించారు. మండలంలో ధూపదీప నైవేద్య పథకం కింద వేతనం పొందుతున్న పూజారులు అన్ని దేవాలయాల్లో వారం రోజుల్లోగా దేవాదాయ శాఖ బోర్డులు ఏర్పాటు చేయాలని పూజారులకు సూచించారు ఈ సందర్భంగా దేవాదాయ అసిస్టెంట్ కమిషనర్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో హిందూ సనాతన ధర్మాన్ని పరిరక్షించడం దేవాలయ వ్యవస్థను బలోపేతం చేయడమే ధూపదీప నైవేద్య పథకం ప్రధాన ఉద్దేశమని తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ పథకం కింద అందిస్తున్న సహాయాన్ని రూ.5 వేల నుంచి రూ.10 వేలకు పెంచిందన్నారు. జిల్లాలో సుమారు 750 దేవాలయాల్లో ఈ పథకం అమలులో ఉందని వెల్లడించారు అలాగే టీటీడీ నిధులతో అమలు చేస్తున్న శ్రీవాణి ట్రస్ట్ పథకం గురించి గ్రామస్తులకు వివరించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మత్స్యకార కాలనీలు వంటి వెనుకబడిన ప్రాంతాల్లో హిందూ మతాభివృద్ధి కోసం కొత్త దేవాలయాలు, భజన మండపాల నిర్మాణానికి ఈ పథకం ద్వారా ఆర్థిక సహాయం అందిస్తున్నట్లు చెప్పారు. గ్రామాలలో నూతన దేవాలయాల నిర్మాణం కోసం దరఖాస్తు చేసుకుంటే దేవాలయానికి 10 సెంట్ల స్థలం ఉందని తహసీల్దార్ ధృవీకరిస్తే రూ.20 లక్షలు, 8 సెంట్లు ఉంటే రూ.15 లక్షలు, 5 సెంట్లు ఉంటే రూ.10 లక్షల వరకు మంజూరు చేస్తామని తెలిపారు. గతంలో రూ.5 లక్షలుగా ఉన్న ఈ సహాయాన్ని ప్రస్తుత కూటమి ప్రభుత్వం భారీగా నిధులు పెంచిందని తెలిపారు.అనంతరం వేమలూరు గ్రామం ఎస్సీ కాలనీలో ఉన్న మాతమ్మ దేవాలయాన్ని సందర్శించారు. అక్కడ గ్రామస్తులతో సమావేశమై ఆలయ అభివృద్ధి అవసరాలపై చర్చించారు. గ్రామంలో సుమారు 55 ఎస్సీ కుటుంబాలు నివసిస్తూ హిందూ సంప్రదాయాలను ఆచరిస్తున్నందున మాతమ్మ ఆలయ అభివృద్ధి అత్యవసరమని గ్రామస్తులు విజ్ఞప్తి చేశారు.గ్రామస్తుల అభ్యర్థనపై స్పందించిన దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ అవసరమైన ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపించి శ్రీవాణి ట్రస్ట్ పథకం కింద నిధులు మంజూరు అయ్యేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ప్రతి ఏడాది ఘనంగా జరిగే మాతమ్మ ఉత్సవాల గురించి తెలుసుకుని అమ్మవారిని దర్శించుకున్నారు. గ్రామస్తుల మధ్య కూర్చుని వారి సమస్యలను తెలుసుకుని ఆలయ అభివృద్ధికి తన వంతు సహకారం అందిస్తానని భరోసా ఇచ్చారు ఈ కార్యక్రమంలో కడప దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ శంకర్ బాలాజీ, దేవాలయాల తనిఖీ అధికారి జనార్ధన్, రికార్డ్ అసిస్టెంట్ కొండయ్య తదితరులు పాల్గొన్నారు

## ఆర్థిక కార్యకలాపాలు మరింత పుంజుకునేలా బ్యాంకర్లు సహకరించాలి

-మొదటిపేజీ తరువాయి

డిజిటల్ ఆర్థిక నేరాల నియంత్రణ దిశగా బ్యాంకులు చర్యలు తీసుకోవాలని బ్యాంకర్లకు సీఎం దిశానిర్దేశం చేశారు. డిజిటల్ అరెస్టులు, ఇతర సైబర్ నేరాలకు అడ్డుకట్ట వేసేందుకు ఓ ప్రత్యేక ఎస్ఓపీ ని రూపొందించాలని సూచించారు.

**రుణ ప్రణాళిక**

వ్యవసాయం సహా ప్రాధాన్యతా రంగాలకు రూ.5.4 లక్షల కోట్లు, ఇతర రంగాలకు రూ.2.70 లక్షల కోట్లు ఇవ్వాలని ప్రణాళిక చేశారు. ప్రత్యేకించి వ్యవసాయ రంగానికి రూ.3.60 లక్షల కోట్లు, పంట రుణాల కింద రూ.2 లక్షల కోట్లు ఇవ్వాలని బ్యాంకులు నిర్ణయించాయి. వ్యవసాయ యాంత్రీకరణ రూ.10,693 కోట్ల మేర ఆర్థిక సహకారం అందించాలని రుణ ప్రణాళికలో ఖరారు చేశారు. ఎంఎస్ఎంఈ రంగానికి రూ.1.55 లక్షల కోట్లు, మైక్రో ఎంటర్ ప్రైజెస్ కోసం రూ.70 వేల కోట్లు, గృహ నిర్మాణానికి రూ.11,500 కోట్లు, విద్యా రుణాలకు రూ.2,500 కోట్లు కేటాయిస్తున్నట్లు రుణ ప్రణాళికలో వెల్లడించాయి.

**ఏపీలో 137 శాతం మేర రుణ వితరణ**

2025-26లో వ్యవసాయ రంగానికి రూ. 3 లక్షల 86 వేల 249 కోట్ల రుణం ఇచ్చినట్లు బ్యాంకర్లు వివరించారు. చిన్న, మధ్య తరహా పరిశ్రమలకు రూ. లక్షా 17 వేల 357 కోట్లు, ప్రాధాన్యతా రంగానికి రూ. 5 లక్షల 19 వేల 693 కోట్ల రుణాలు ఇచ్చినట్లు తెలిపారు. దక్షిణ భారతదేశంలో ఇతర రాష్ట్రాలతో పోలిస్తే ఏపీలో రుణ వితరణ 137 శాతం మేర ఉన్నట్టు బ్యాంకర్లు సీఎం చంద్రబాబుకు వివరించారు.

## భూసమీకరణ రైతులకు ప్రత్యేక క్యూఆర్ కోడ్

-మొదటిపేజీ తరువాయి

పాటు, ఇంకా కౌలు జమ కాని వారి వివరాలు, చెల్లింపులు నిలిచిపోవడానికి గల కారణాలను కూడా ఇందులో వెల్లడించారు. నేరుగా బ్యాంకుకే: ఎన్‌పీసీఐ వ్యవస్థలో ఇనాక్టివ్‌గా ఉన్న బ్యాంకు ఖాతాలను కలిగిన రైతుల జాబితాను సైతం అందుబాటులో ఉంచారు. రాజధాని రైతులకు కౌలు చెల్లింపులు నేరుగా బ్యాంకు ఖాతాలకు జమ చేస్తున్న నేపథ్యంలో, ఎన్?పీసీఐ లింకేజీ సక్రమంగా లేకపోవడం లేదా బ్యాంకు ఖాతాలు ఇనాక్టివ్‌గా ఉండటం వంటి కారణాల వల్ల కొందరి ఖాతాలకు డబ్బు జమ కావడం లేదు. అలాంటి రైతులు తమ ఖాతా ఉన్న బ్యాంకును సంప్రదించి ఖాతాలను యాక్టివ్ చేసుకోవాలని ఏపీసీఆర్?డీఏ తరపున సూచించారు. రైతులు తమ వార్షిక కౌలు చెల్లింపు స్థితిని సులభంగా తెలుసుకునేందుకు ఏపీసీఆర్డీఏ నుంచి క్యూఆర్? కోడ్‌ను విడుదల చేశారు.

ఆ ఖాతాలను యాక్టివేట్ చేసుకోవాలి: ఈ కోడ్‌ను స్కాన్ చేస్తే సంబంధిత వెబ్‌పేజీలో రాజధాని రైతులు తమ వివరాలను చెక్ చేసుకోవచ్చని సంబంధిత అధికారులు తెలుపుతున్నారు. దీంతో కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా ఇంటి వద్ద నుంచే కౌలు లబ్ధి సమాచారం తెలుసుకునే సౌకర్యం కల్పించారు. కౌలు లబ్ధి పొందని రైతులు తమ పేర్లు, ఖాతా వివరాలు ఏ కారణం చేత కౌలు జమ కాలేదోనన్న అంశాలను సైతం చెక్ చేసుకోవచ్చునని అధికారులు తెలుపుతున్నారు. ఆధార్ ఇనాక్టివ్‌గా ఉన్న బ్యాంక్ ఖాతాలలో కౌలు నగదు జమ చేయడం సాధ్యపడదు కనుక ఆధార్ ఇనాక్టివ్‌గా ఉన్న బ్యాంకు ఖాతాలు కలిగిన రైతులు వెంటనే ఆ ఖాతాలను యాక్టివేట్ చేసుకోవాలని సూచించారు.

## రూ. 24 కోట్లతో 'అరణ్యారామం'

-మొదటిపేజీ తరువాయి

చేపడుతున్న కార్యక్రమాలన్నింటినీ ఒకే వేదిక నుంచి సమన్వయం చేసే కామన్ ఫెసిలిటీ సెంటర్ గా సేవలు అందించనుంది. రాష్ట్ర అటవీ పరిశోధన, శిక్షణ కార్యక్రమాలకు అరణ్యారామం వేదిక కానుంది. కార్యకలాపాలకు కమాండ్ సెంటర్‌గా, ఆంధ్రప్రదేశ్ గ్రేట్ గ్రీన్ వాల్ కార్యక్రమానికి పర్యవేక్షణ కేంద్రంగా, పులుల సంరక్షణ, అటవీ అగ్నిప్రమాదాల నివారణ, జీవావరణ పునరుద్ధరణ, వాతావరణ స్థిరత్వం, ఎకో--టూరిజం అభివద్ధి, డిజిటల్ పర్యావరణ పరిపాలన తదితర విభాగాలకు సమన్వయ కేంద్రంగా సేవలు అందించనుంది. అధునాతన సాంకేతికత సాయంతో ప్రకతి పరిరక్షణ ధ్యేయంగా అరణ్యారామంలో శాస్త్రీయ పరిశోధనలు జరపనున్నారు. క్షేత్ర స్థాయిలో అమలు చేసే కార్యకలాపాలన్నింటినీ ఒకే చోటు నుంచి పర్యవేక్షించే పరిపాలనా కేంద్రంగా నిలవనుంది. శంకుస్థాపన అనంతరం అరణ్యారామం భవన నమూనా, నిర్మిస్తున్న ప్రదేశానికి సంబంధించిన వివరాలను పవన్ కళ్యాణ్ పరిశీలించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అటవీ, పర్యావరణ శాఖ ముఖ్యకార్యదర్శి కాంతిలాల్ దండే, అటవీశాఖ సలహాదారు మల్లికార్జునరావు, అటవీ శాఖ పీసీసీఎఫ్ పి వి చలపతి రావు, రాష్ట్ర మెడికల్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ డెవలప్మెంట్ కార్పోరేషన్ ఛైర్మన్ చిల్లపల్లి శ్రీనివాసరావు, పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ ఛైర్మన్ కళ్యాణం శివ శ్రీనివాస్, పీసీబీ ఛైర్మన్ డాక్టర్ పి కష్ణయ్య, బయో డైవర్సిటీ బోర్డ్ ఛైర్మన్ నీలాయపాలెం విజయ్ కుమార్, రాష్ట్ర సైన్స్ అండ్ టెక్నాలజీ కౌన్సిల్ మెంబర్ సెక్రటరీ కె శరత్ కుమార్, అటవీశాఖ ఐటీ సలహాదారు పి.నాగబాబు, అటవీ శాఖ ఉన్నతాధికారులు రేవతి, రాహుల్ పాండే, గుంటూరు జిల్లా కలెక్టర్ సాయికాంత్ వర్మ, ఎస్పీ వకుళ్ జిందాల్, ఇతర అటవీశాఖ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## ఏపీలో వంద శాతం సినిమా షూటింగ్ చేస్తే భారీ సబ్సిడీ

-మొదటిపేజీ తరువాయి




వెల్లడించారు. దేశీయ పర్యాటకంలో 17 శాతం వృద్ధి.. 13వ స్థానానికి చేరిన ఆంధ్రప్రదేశ్. సాంస్కృతిక రంగానికి పూర్వవైభవం -- 'ఆరెంజ్ ఎకానమీ'తో ఏపీ బ్రాండింగ్. ప్రతి జిల్లాకు ఒక మ్యూజిక్ కాలేజ్.. కళాకారుల పెన్షన్ల పునరుద్ధరణకు చర్యలు. చలనచిత్ర రంగానికి ఊతం -- గతంలో ప్రకటించిన వాటితో పాటు 2025 నుండి మళ్లీ 'నంది అవార్డులు' ప్రదానం. ఈ ఏడాది నవంబర్ -- డిసెంబర్‌లలో నంది నాటకోత్సవాలు. 2027లో గోదావరి, 2028లో కృష్ణా పుష్కరాలను ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తాం. పర్యాటక రంగానికి పారిశ్రామిక హోదా కల్పించడం, నూతన పర్యాటక పాలసీ 2024--29 విడుదల నుంచి 117 ప్రముఖ సంస్థలతో ఎంఓయూలు కుదర్చుకొని దాదాపు రూ.20,000 కోట్ల భారీ పెట్టుబడుల ఆకర్షణ వరకు, జాతీయ స్థాయి అవార్డుల నుంచి ప్రపంచ స్థాయి పర్యాటక గమ్యస్థానంగా రాష్ట్రాన్ని తీర్చిదిద్దే దిశగా ప్రభుత్వం వేగంగా అడుగులు వేస్తోందన్నారు. ఈ ప్రాజెక్టులు పూర్తిస్థాయిలో అమలైతే 1,22,637 మందికి ప్రత్యక్ష,పరోక్ష ఉపాధి అవకాశాలు లభిస్తాయని పేర్కొన్నారు. ప్రస్తుతం ఉన్న 4,390 హోటల్ గదులకు అదనంగా మరో 9,042 గదులు అందుబాటులోకి వచ్చేలా 50 కొత్త హోటళ్లకు అనుమతులు ఇచ్చామని తెలిపారు. అందులో భాగంగా నిర్మాణ దశలో ఉన్న 42 హోటళ్ల ద్వారా 48,168 ఉద్యోగాలు లభిస్తాయన్నారు. పీపీపీ విధానంలో పర్యాటకాభివద్ధి చేస్తున్నామని, అధికారుల సమిష్టి కషితో ఐదేళ్లలో రాష్ట్రవ్యాప్తంగా 50 వేల గదులు ఏర్పాటు చేయడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఆల్ ఇండియా టూర్ ఆపరేటర్స్ అసోసియేషన్ అంతర్జాతీయ స్థాయి సమావేశాన్ని ఈ ఏడాది సెప్టెంబర్ 11, 12 తేదీల్లో విశాఖలో నిర్వహించనున్నారని, ఇప్పటికే వారితో ఎంఓయూ కుదుర్చుకున్నట్లు మంత్రి దుర్గేష్ వెల్లడించారు. రాష్ట్రంలో ఫిల్మ్ ఇన్ స్టిట్యూట్ ఏర్పాటుకు సన్నాహాలు చేస్తున్నామన్న మంత్రి దుర్గేష్ 100 శాతం ఏపీలో షూటింగ్ లు జరుపుకునే చిత్రాలను గుర్తించి సంవత్సరానికి 15 చిత్రాలకు 10 లక్షల చొప్పున నగదు సబ్సిడీ అందిస్తున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో పర్యాటక శాఖ స్పెషల్ సీఎస్ అజయ్ జైన్, టూరిజం ఇంచార్జ్ ఎండీ పద్మావతి, ఈడీ శేషగిరి రావు, శిల్పారామం సీఈవో స్వామినాయుడు, సాంస్కృతిక శాఖ డైరెక్టర్ రేగుళ్ల మల్లిఖార్జున రావు, ఎఫ్ డీసీ జనరల్ మేనేజర్ శ్రీనివాస్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఒక ఉపాధ్యాయుడు తరగతి గదిలోకి అడుగుపెడుతూ.. పాఠ్యపుస్తకాలు, పాఠ్య ప్రణాళికలే తీసుకొస్తాడనుకుంటే పొరబాటు. వాస్తవంలో -టీచర్లు భుజాలపై ఎన్నో అంచనాల భారం మోస్తూ తరగతి గదిలోకి వస్తారు. తల్లిదండ్రులు తమ పిల్లలకు వ్యక్తిగత శ్రద్ధ కావాలని కోరుకుంటారు. పాఠశాల యాజమాన్యాలు అకడమిక్ శ్రేష్ఠత, క్రమశిక్షణ, వినూత్న బోధన, కొలవగలిగే ఫలితాలు ఆశిస్తాయి. సమన్వయకర్తలు పాఠ్యాంశాల అమలు, మూల్యాంకన వేళాపట్టీలు, నిబంధనల పాటింపుపై దృష్టిపెడతారు. విద్యాధికారులు నిర్దేశిత విధానాలు, మార్గదర్శకాల అనుసరణ కోరుకుంటారు. సమాజం మొత్తం బాధ్యతాయుతమైన, విలువలతో కూడిన పౌరులను తీర్చిదిద్దాల్సిన బాధ్యతను ఉపాధ్యాయుడిపైనే నెట్టేస్తుంది. ఇవన్నీ చాలదన్నట్టు విద్యార్థులు తమ విద్య ఆసక్తికరంగా, వ్యక్తిగతీకరించబడి, అర్థవంతంగా ఉండాలని ఆకాంక్షిస్తారు. ఇన్ని వైపులనుంచి వస్తున్న అంచనాల మధ్య నలుగుతూ, సమర్థంగా, స్ఫూర్తిదాయకంగా, భావోద్వేగపరంగా పూర్తిగా ఉండాలని తపిస్తూ ఆధునిక ఉపాధ్యాయుడు పనిచేస్తున్నాడు. విద్యావ్యవస్థ గురించి జరిగే చర్చలన్నీ విద్యార్థులు, మౌలిక సదుపాయాలు, సాంకేతికత, పాఠ్యప్రణాళిక సంస్కరణల చుట్టూనే తిరుగుతాయి. కానీ ఒక కీలకమైన ప్రశ్న ఎప్పటికీ సమాధానం లేకుండా మిగిలిపోతోంది. అది -టీచర్లను పట్టించుకునేదెవరు? భారతదేశంలో జాతీయ విద్యా విధానం 2020 ఉపాధ్యాయుల వృత్తిపరమైన అభివృద్ధి, శ్రేయస్సు గురించి మాట్లాడింది. అయినప్పటికీ అమలు స్థాయిలో ఉపాధ్యాయుల మానసిక ఆరోగ్యం, వృత్తి సంతృప్తి, పని-జీవన సమతుల్యత వంటి అంశాలు ఇంకా తగిన దృష్టి పొందడం లేదు. గురువుకు ఉండాల్సిన గౌరవం మాటలతో ఇస్తున్నాం కానీ పనితీరు, మద్దతు, వ్యవస్థతో ఆ గౌరవాన్ని ఆచరణలో చూపించడం లేదు.

టీచర్ పని -చివరి గంట మోగడంతో అయిపోదు. పాఠ్య ప్రణాళికలు సిద్ధం చేయడం, మూల్యాంకనాలు నిర్వహించడం, నివేదికలు రాయడం, సమావేశాలలో పాల్గొనడం, తల్లిదండ్రులతో సంప్రదింపులు జరపడం.. ఇవన్నీ పాఠశాల గంటలు ముగిసిన తర్వాతా కొనసాగుతాయి. వాస్తవంలో డిజిటల్ నివేదికలు, ఆన్‌లైన్ పోర్టల్‌లు, వాట్సాప్ సమూహాలు, ఈమెయిల్ సందేశాలు, ఎల్ఎంఎస్ పద్ధతులు టీచర్ల పని వేళలను పెంచాయి. యునెస్కో 2023 నివేదిక ప్రకారం ప్రపంచవ్యాప్తంగా ఉపాధ్యాయులు వారానికి సగటున 47 గంటలకు పైగా పనిచేస్తున్నారు. వీటిలో అర్ధరాత్రి తర్వాత కూడా సాగే పాఠ్య పూర్వక తయారీ, మూల్యాంకన పని ఉంటున్నాయి. భారతదేశంలో ప్రాథమిక, మాధ్యమిక పాఠశాలల్లో పనిచేసే ఉపాధ్యాయుల్లో గణనీయమైన శాతం వృత్తి అలసట, ఒత్తిడి, మానసిక ఒంటరితనం అనుభవిస్తున్నారని పలు అధ్యయనాలు వెల్లడించాయి.

విద్యావ్యవస్థలో ప్రతి అంచెలోనూ ఒత్తిడి ఉంది. ప్రధానోపాధ్యాయులు యాజమాన్యాలకు, నియంత్రణ సంస్థలకు, తల్లిదండ్రులకు జవాబుదారీగా ఉండాలి. సమన్వయకర్తలు, విభాగాధ్యక్షులు పాఠ్యాంశ అమలు నిర్వహించడంతోపాటు, మూల్యాంకన నిర్వహణ, ఉపాధ్యాయులకు మద్దతు, తల్లిదండ్రుల ఫిర్యాదులు, విధాన సూత్రాలను తరగతి గది పద్ధతులుగా మార్చడం వంటి అనేక బాధ్యతలు మోస్తున్నారు. ఈ నేపథ్యంలో విద్యా నాయకత్వం కేవలం గడువులు, నివేదికలు,


## ...సారీ టీచర్!

పనితీరు డేటా పర్యవేక్షణకే పరిమితం కాకూడదు. నిజమైన విద్యా నాయకులు కేవలం పర్యవేక్షకులు కాదు. వారు సులభకారులు, మార్గదర్శకులు, ఉపాధ్యాయుల తరఫున నిలబడే న్యాయవాదులు. ఉపాధ్యాయుల శ్రేయస్సు విద్యార్థుల నేర్చుకోవడాన్ని నేరుగా ప్రభావితం చేస్తుందని అర్థం చేసుకున్న పాఠశాలలే నిజంగా బలమైనవి. నమ్మకంతో, మద్దతుతో, విలువతో జీవించే టీచర్లే విశ్వాసంతో, సృజనాత్మకంగా, నిబద్ధతగా బోధిస్తారు. ఇది కేవలం సిద్ధాంతం కాదు -ఫిన్‌లాండ్, సింగపూర్ వంటి విద్యారంగంలో అగ్రభాగాన ఉన్న దేశాలు ఇది చాటి చెప్పాయి. ఫిన్‌లాండ్‌లో ఉపాధ్యాయ వృత్తి అత్యంత గౌరవప్రదమైనది. అక్కడ ఉపాధ్యాయుల శ్రేయస్సు, స్వాతంత్ర్యం, వృత్తి అభివృద్ధిపై పెట్టుబడి పెట్టడం వల్లనే ఆ దేశం పీసా ర్యాంకింగ్‌లో సదా అగ్రస్థానంలో ఉంటోంది.

సమాజం ఉపాధ్యాయులు ఒత్తిడిని తట్టుకుని, సృజనాత్మకతను నింపి, భవిష్యత్తు నాయకులను తీర్చిదిద్దాలని ఆశిస్తుంది. కానీ వారి సొంత శ్రేయస్సును విస్మరిస్తుంది.

## సంపాదకీయం

పెరుగుతున్న పరిపాలనా భారంతో నలిగే టీచర్లకు వృత్తిపరమైన, మానసికమైన ఎదుగుదలకు అవసరమైన మద్దతు చాలా పరిమితం. నిరాశ, వృత్తి అలసట, ఉపాధ్యాయ వృత్తి వదిలిపెట్టే ధోరణి ప్రపంచవ్యాప్తంగా పెరుగుతోంది. అమెరికాలో 2023-24 విద్యా సంవత్సరంలో ఉపాధ్యాయ కొరత తీవ్రంగా మారింది. వేలాది టీచర్లు వృత్తి వదిలిపెట్టారు. మన దేశంలోనూ గ్రామీణ, మారుమూల ప్రాంతాల్లో ఉపాధ్యాయ పదవులు ఖాళీగా ఉండటం, నగర పాఠశాలల్లో ఒక ఉపాధ్యాయుడు అనేక సబ్జెక్టులు బోధించాల్సిన పరిస్థితి నిజంగా ఆందోళనకరం. ఉపాధ్యాయుల మానసిక ఆరోగ్యానికి సంబంధించిన సహాయక కార్యక్రమాలు, క్రమానుగత సలహా సేవలు, పని వేళల నిర్వహణ, సహోద్యోగ సమూహాలు ఇప్పుడు ఏ పాఠశాలలోనైనా అవసరం. పాఠశాల విజయాన్ని కేవలం పరీక్షా ఫలితాలతో కొలవడం ఆపి, ఉపాధ్యాయుల సంతృప్తి, వృత్తిలో కొనసాగే ఉద్దేశం, పని వాతావరణ నాణ్యత వంటి సూచికలతో కొలవాల్సిన తరుణమిది. పాఠశాల వార్షిక నివేదికలో అకడమిక్ ఫలితాలతోపాటు టీచర్ శ్రేయస్సు సూచికలు చేర్చాలి. టీచర్లకు మానసిక ఆరోగ్య మద్దతు అందించడాన్ని అవసరంగా చూడాలి. జాతీయ విద్యా విధానం 2020 పేర్కొన్న ఉపాధ్యాయ సంప్రదాయ అభివృద్ధి కార్యక్రమాలను నిజంగా అమలు చేయాలి. తల్లిదండ్రులు, సమాజం కూడా ఉపాధ్యాయులను వ్యతిరేకించే బదులు వారికి వెన్నుదన్నుగా నిలవాలి. చివరికి విద్యా వ్యవస్థ ఒక సత్యాన్ని గుర్తించాల్సిన సమయం వచ్చింది. టీచర్లు అపరిమితమైన ఒత్తిడిని భరించడానికి రూపొందించబడిన యంత్రాలు కాదు. వాళ్లు మనుషులు. స్వప్నాలు, సంవేదనలు, అలసటలు ఉన్న మనుషులు. విద్యార్థులు వికసించాలంటే.. తరగతి గది ముందు నిలబడే గురువులను పోషించాలి, రక్షించాలి, గౌరవించాలి. విద్య యొక్క నిజమైన పునాది పాఠ్యపుస్తకాలు కాదు -అంకితభావంతో, ఆత్మవిశ్వాసంతో నిలబడే ఉపాధ్యాయుడే. ఆ పునాది బలంగా ఉంటేనే విద్యావ్యవస్థ అనే భవనం సుస్థిరంగా నిలబడుతుంది!!



# గాయమే గురువు

### -హెమింగ్వే జీవిత సత్యం

మనసుకు హత్తుకునే సూక్తులు కేవలం ఊహల్లోంచి రావు, జీవితంలో ఎదుర్కొన్న తీవ్రమైన గాయాలనుంచి, వాస్తవ అనుభవాల నుంచి పుడతాయి. ఇరవయ్యో శతాబ్దపు అగ్రగామి అమెరికన్ రచయిత, జర్నలిస్ట్ ఎర్నెస్ట్ హెమింగ్వే చెప్పిన ప్రసిద్ధ సూక్తి నేటికీ ప్రపంచవ్యాప్తంగా ఎందరినో ఆలోచింపజేస్తోంది. యుద్ధరంగంలో నేరుగా పాల్గొని, మృత్యువు అంచుల్లోకి వెళ్లొచ్చిన హెమింగ్వే మానవ జీవితంలోని సున్నితత్వాన్ని ఆవిష్కరించారు. యువకుడిగా యుద్ధానికి వెళ్లినప్పుడు తనకు చావు లేదనే భ్రమలో ఉంటామని, కానీ మొట్టమొదటిసారి తీవ్రంగా గాయపడినప్పుడు ఆ భ్రమ తొలగిపోతుందని, అది తనకూ జరగొచ్చని అర్థమవుతుందని ఆయన చెప్పారు. ఈ మాటల వెనుక ఉన్న లోతైన జీవన సత్యం ఈ నాటికీ ప్రాసంగికంగా ఉంది.

ప్రాణాంతక అనుభవాలు మనిషి ఆలోచనా విధానాన్ని పూర్తిగా మార్చేస్తాయని హెమింగ్వే స్పష్టం చేశారు. మరణం ఎవరికైనా సంభవించవచ్చనే సత్యాన్ని ఇది గుర్తుచేస్తుంది. ఈ సూక్తి కేవలం యుద్ధానికే పరిమితం కాదు -సాధారణ జీవితానికి కూడా అన్వయమవుతుంది. ఏదైనా కష్టం, అనారోగ్యం లేదా ప్రమాదం ఎదురయ్యే వరకు చాలామంది తమకు ఏమీ కాదులే అనే భావిస్తుంటారు. అలాంటి కఠిన పరిస్థితులు ఎదురైనప్పుడే మనిషిలో పరిణతి, వివేకం పెరుగుతాయి. ఈ మాటలు ప్రపంచవ్యాప్తంగా ప్రతి ఒక్కరికీ అనుభవపూర్వకంగా అర్థమవుతాయి. వయసులో ఉన్నప్పుడు ఎవరైనా తాము శక్తిమంతులమని, తమకు ఏమీ కాదని భావిస్తారు. భవిష్యత్తు గురించి లేదా మరణం గురించి ఆలోచించరు. కానీ వాస్తవాలు ఎప్పుడైనా ఆ నమ్మకాలను సవాలు చేస్తాయని హెమింగ్వే మాటలు గుర్తుచేస్తాయి. మొదటి ప్రపంచ యుద్ధంలో అంబులెన్స్ డ్రైవర్‌గా పనిచేస్తూ ఇటలీలో తీవ్రంగా గాయపడిన హెమింగ్వే స్వంత అనుభవాల నుంచే ఈ విషయాలు చెప్పారు. అందుకే ఆయన మాటల్లో అంతటి ప్రామాణికత, భావోద్వేగ సత్యం కనిపిస్తాయి.

హెమింగ్వే చెప్పిన జీవిత సత్యాన్ని మన దైనందిన జీవితంలో అనేక విధాలుగా అన్వయించుకోవచ్చు. జీవితాన్ని, సమయాన్ని ఎల్లప్పుడూ గౌరవించాలి. దేనినీ తేలికగా తీసుకోకూడదు. ప్రతి చర్యకూ ఫలితాలు, ప్రమాదాలు ఉంటాయని గ్రహించాలి. కష్టాల్లో ఉన్నవారి పట్ల మానవత్వంతో, సానుభూతితో వ్యవహరించాలి. అంతా సవ్యంగానే జరుగుతుందని నిర్లక్ష్యంగా కూర్చోకుండా, కష్టాలను ఎదుర్కొనేందుకు ఎల్లప్పుడూ సిద్ధంగా ఉండాలి. ధైర్యంగా జీవించాలి, కానీ బాధ్యతారాహిత్యంగా మాత్రం ప్రవర్తించకూడదు. విలువైన బంధాలను, అనుభవాలను కాపాడుకోవాలి. కఠిన పరిస్థితుల నుంచి పాఠాలు నేర్చుకుని మరింత పరిపక్వంగా ఎదగాలి.

ఎర్నెస్ట్ హెమింగ్వే ఎవరు?

ఎర్నెస్ట్ హెమింగ్వే 1899 జూలై 21న అమెరికాలోని ఓక్ పార్క్‌లో జన్మించారు. ఆయన తండ్రి వైద్యుడు, తల్లి మ్యూజిక్ టీచర్. పాఠశాల రోజులనుంచే రాయడంపై అభిరుచి పెంచుకున్న హెమింగ్వే కళాశాల చదువులకు వెళ్లకుండా 'కాన్సాస్ సిటీ స్టార్' పత్రికలో రిపోర్టర్‌గా జీవితాన్ని ప్రారంభించారు. మొదటి ప్రపంచ యుద్ధంలో అంబులెన్స్ డ్రైవర్‌గా పొందిన అనుభవాలు ఆయన సాహిత్య ప్రస్థానాన్ని లోతుగా ప్రభావితం చేశాయి. ఇరవయ్యో శతాబ్దపు అత్యంత ప్రభావవంతమైన రచయితలలో ఒకరిగా నిలిచిన ఆయన 1954లో నోబెల్ సాహిత్య బహుమతిని అందుకున్నారు. 'ది ఓల్డ్ మ్యాన్ అండ్ ది సీ', 'ఏ ఫేర్‌వెల్ టు ఆర్మ్స్', 'ఫర్ హూమ్ ది బెల్ టోల్స్', 'ది సన్ ఆల్సో రైజెస్', 'టు హేవ్ అండ్ హేవ్ నాట్' వంటి కాలజయి రచనలు ఆయన కలం నుంచి జాలువారాయి. ధైర్యం, కష్టం, ప్రేమ, యుద్ధం, మానవ ఉనికి వంటి కఠిన వాస్తవాల చుట్టూ ఆయన రచనలు సాగాయి. 1961 జూలై 2న కన్నుమూసిన హెమింగ్వే ప్రపంచ సాహిత్యంలో చెరిపివేయలేని ముద్ర వేశారు. ఆయన మాటలు, రచనలు నేటికీ లక్షల మంది జీవితాలను ప్రేరేపిస్తూనే ఉన్నాయి --- ఎందుకంటే అవి అనుభవం నుంచి పుట్టిన సత్యాలు.

# 'శాంతి'నెత్తిన 'త్రి'శూలం!




మధ్యప్రాచ్యంలో దశాబ్దాల ఉద్రిక్తతలు 2026లో అగ్నిగుండమయ్యాయి. ఫిబ్రవరి 28న అమెరికా-ఇజ్రాయెల్ సంయుక్త దాడులతో ప్రారంభమైన యుద్ధం ఇరాన్ అత్యున్నత నాయకత్వాన్ని మట్టుపెట్టింది. దేశ సైనిక మౌలిక సదుపాయాలను శిథిలం చేసింది. ప్రతిగా ఇరాన్ హర్మూజ్ జలసంధిని మూసేసి ప్రపంచ వాణిజ్యాన్ని స్తంభింపజేసింది. వేలాది మరణాలు, ఇంధన ధరల మంటలు, ఆహార కొరత వంటి తీవ్ర పరిణామాలకు దారితీసిన యుద్ధాన్ని ముగించేందుకు పాకిస్తాన్ మధ్యవర్తిత్వంలో ఏప్రిల్ 8న తొలి యుద్ధవిరమణ కుదిరింది. వారాల తరబడి జరిగిన చర్చల తర్వాత జూన్ 15నాటికి 14 పేరాల అవగాహనా ఒప్పందం రూపుదిద్దుకుంది. అమెరికా నావికాదళ దిగ్బంధాన్ని తొలగించడం, హర్మూజ్ జలసంధి పునరుద్ధరణ, ఆంక్షల ఎత్తివేత, ఇరాన్ పునర్నిర్మాణానికి 300 బిలియన్ డాలర్ల నిధి ఏర్పాటువంటి కీలకమైన అంశాలు ఇందులో చోటుచేసుకున్నాయి. ట్రంప్-పెజెష్కియాన్ సంతకాలతో 60 రోజుల గడువులో తుది ఒప్పందం కుదుర్చుకోవడానికి మార్గం సుగమమైంది. అయితే స్విట్జర్లాండ్‌లో జరగాల్సిన సంతకాల కార్యక్రమం వాయిదా పడింది. ఈ ప్రాథమిక ఒప్పందం తుది పరిష్కారం కాదని, ఒప్పందం విఫలమైతే మళ్లీ బాంబుల దాడికి దిగుతానని ట్రంప్ హెచ్చరించారు. అమెరికాపై అపనమ్మకం అలానే ఉందని, వేలు ఎప్పుడూ ట్రిగ్గర్‌పైనే ఉంటుందని ఇరాన్ పార్లమెంట్ స్పీకర్ గాలిబాఫ్ స్పష్టం చేశారు. శాంతి సాధనకు ఎంతో దూరం వెళ్లినట్టు కనిపించినా, ఒప్పందాన్ని ప్రమాదంలో పడేసేందుకు మూడు శూలాలు ముంగిటే ఉన్నాయి.

మొదటి సవాలు -లెబనాన్‌లో ఇజ్రాయెల్ సైనిక చర్యలు. అవగాహనా ఒప్పందంలో లెబనాన్ ప్రాంతీయ సమగ్రతకు భరోసా దొరికింది. మధ్యవర్తి పాక్ ప్రధాని షాబాజ్ షరీఫ్ కూడా అన్ని రంగాల్లో సైనిక చర్యలు తక్షణమే నిలిపివేయాలని ఇరుపక్షాలు అంగీకరించాయని ప్రకటించారు. అయినప్పటికీ లెబనాన్‌పై ఇజ్రాయెల్ దాడులు ఆపలేదు. నబాతియా అల్-ఫౌకా, క్ఫార్ టెబ్నిట్ శివార్లపై ఇజ్రాయెల్ యుద్ధ విమానాలు దాడులు కొనసాగించాయి. లెబనాన్ భూభాగం నుంచి ఇజ్రాయెల్ సైన్యాన్ని ఉపసంహరించుకోవాలనే షరతు ఒప్పందంలో లేదని, ఇజ్రాయెల్‌కు ఆత్మరక్షణ హక్కు ఉంటుందని అమెరికా అధికారులు చెప్తున్నారు. కానీ లెబనాన్‌లో యుద్ధం ముగించడం తుది ఒప్పందంలో విడదీయరాని భాగమని ఇరాన్ స్పష్టమైన వైఖరి తీసుకుంది. ఇరాన్ మద్దతుగల హిజ్బుల్లా కూడా ఇదే పట్టుదలతో ఉంది. తదుపరి చర్చల దశలో లెబనాన్ నుంచి ఇజ్రాయెల్ పూర్తి ఉపసంహరణ డిమాండ్ చేస్తామని హిజ్బుల్లా స్పష్టం చేసింది. లెబనాన్‌లో తమ సైన్యం ఎంతకాలం ఉంటుందనే దానికి కాలపరిమితి లేదని ఇజ్రాయెల్ రక్షణ మంత్రి కాట్జ్ నిక్కచ్చిగా అన్నారు. బ్రిటన్‌కు చెందిన రాయల్ యునైటెడ్ సర్వీసెస్ ఇన్‌స్టిట్యూట్ నిపుణుడు డాక్టర్ హెలియర్ ఇజ్రాయెల్ సైనిక దూకుడు శాంతి ప్రయత్నాలకు అతిపెద్ద ముప్పుగా పేర్కొన్నారు. లెబనాన్‌లో 3,700 మందికి పైగా మరణించగా, పది లక్షల మంది నిర్వాసితులయ్యారు. ఆ గాయాలు మానకముందే మళ్లీ దాడులు జరగడం శాంతి ప్రక్రియకు తీవ్రమైన దెబ్బ.

రెండో సవాలు -ఇరాన్ అణు కార్యక్రమం. ఇరాన్ వద్ద ఉన్న అత్యధిక స్థాయిలో శుద్ధి చేసిన యురేనియం నిల్వలు ఏం చేయాలనే విషయంలో కేవలం 60 రోజుల గడువు ఇవ్వడం జరిగింది. అంతర్జాతీయ అణుశక్తి సంస్థ గత ఏడాది నాటి నివేదిక ప్రకారం ఇరాన్ 60 శాతం స్వచ్ఛతతో సుమారు 400 కిలోల యురేనియంను సేకరించింది. అణ్వాయుధ తయారీకి దాదాపు 90 శాతం స్వచ్ఛత అవసరం. తమ కార్యక్రమం కేవలం శాంతియుత అవసరాల కోసమేనని తెహ్రాన్ మొదటి నుంచి చెబుతోంది. ఒప్పందంలోనూ అణ్వాయుధాలు తయారు చేయబోమని పునరుద్ఘాటించింది. కానీ అమెరికా, ఇజ్రాయెల్‌లకు ఆ హామీలపై నమ్మకం లేదు. శుద్ధి చేసిన యురేనియంను అంతర్జాతీయ అణుశక్తి సంస్థ పర్యవేక్షణలో 'డౌన్‌బ్లెండ్' చేయడానికి ఇరుపక్షాలు సూత్రప్రాయంగా అంగీకరించాయి. 2015లో ఒబామా హయాంలో కుదిరిన అణు ఒప్పందం ప్రకారం ఇరాన్ యురేనియం శుద్ధిని 3.67 శాతానికి పరిమితం చేసింది. కానీ 2018లో ట్రంప్ ఆ ఒప్పందం నుంచి వైదొలిగిన తర్వాత ఇరాన్ తన అణు కార్యక్రమాన్ని భారీగా విస్తరించింది. చరిత్ర పాఠాన్ని మరచిపోకుండా ఇరాన్ ఇప్పుడు జాగ్రత్తగా అడుగులు వేస్తోంది. ఒప్పందం విఫలమై మళ్లీ అణుస్థాయి శుద్ధి ప్రారంభమైతే అమెరికా సైనిక చర్యలకు దిగుతుందని అమెరికా రక్షణ మంత్రి కార్యాలయ నిపుణులు తెలిపారు. ఈ 60 రోజుల గడువులో అణు సమస్యకు పరిష్కారం కనుగొనడం నిజంగానే భగీరథ ప్రయత్నమే. ఎందుకంటే 2015 ఒప్పందానికి సంవత్సరాల కాలం పట్టింది మరి!

మూడో సవాలు -హార్మూజ్ జలసంధి నిర్వహణ. యుద్ధ కాలంలో ఇరాన్ ప్రభావవంతంగా మూసేసిన ఈ జలసంధి గుండా యుద్ధానికి ముందు ప్రపంచ చమురు, గ్యాస్ సరఫరాలో దాదాపు 20 శాతం సాగేది. ఒప్పందం సంతకాల తర్వాత జలమార్గం తిరిగి తెరుచుకుంటుందని, మందుపాతరల తొలగింపువంటి సాంకేతిక అడ్డంకులు తొలగిన తర్వాత 30 రోజుల్లోగా పూర్తి కార్యకలాపాలు ప్రారంభమవుతాయని ఒప్పందంలో పేర్కొన్నారు. తొలి 60 రోజుల వరకు ఎలాంటి రుసుము వసూలు ఉండదని కూడా స్పష్టం చేశారు. అయితే జలసంధి నిర్వహణలో మరింత పెద్ద పాత్ర కావాలని, నౌకల నుంచి సర్వీస్ ఫీజు వసూలు చేస్తామని ఇరాన్ సంకేతాలిచ్చింది. అంతర్జాతీయ చట్టాల ప్రకారం మార్గం గుండా ప్రయాణానికి రుసుము వసూలు చేయడానికి అనుమతి లేదు. జలసంధిలో ఇరాన్ అమర్చిన మందుపాతరలను తొలగించడానికి వారాలనుంచి నెలల సమయం పట్టొచ్చని అమెరికా నేవీ రిటైర్డ్ రియర్ అడ్మిరల్ మార్క్ మోంట్‌గోమరీ హెచ్చరించారు. యుద్ధవిరమణ నిలకడగా కొనసాగుతుందనే నమ్మకం కలిగే వరకు నౌకాయాన సంస్థలు జాగ్రత్తగా ముందడుగు వేసే అవకాశం ఉందని నిపుణులు చెప్తున్నారు. ఇరాన్ రుసుము విధిస్తే సైనిక ఉద్రిక్తతలు మరింత పెరుగుతాయి కాబట్టి వివేకంతో వ్యవహరించాలన్నది ట్రంప్ హెచ్చరిక. ఒప్పందానికి వచ్చే చర్చల వెనుక ఉన్న అసలు సవాల్ ఏమిటంటే -దశాబ్దాల అపనమ్మకాన్ని 60 రోజుల్లో పరిష్కరించాలని కోరడం. అమెరికా-ఇరాన్ యుద్ధవిరమణ 60 రోజులు పొడిగింపు పొంది తుది ఒప్పందానికి మార్గం సుగమం చేసినప్పటికీ, అణు కార్యక్రమం అంశం ఇంకా పరిష్కారం కాలేదు. లెబనాన్‌లో ఇజ్రాయెల్ దాడులు కొనసాగుతున్నంత కాలం ఇరాన్ పూర్తిగా నమ్మకంతో ముందడుగు వేయదు. అణు సమస్యకు స్పష్టమైన పరిష్కారం లేకుండా అమెరికా మళ్లీ సైనిక చర్యలకు దిగే ప్రమాదం పొంచి ఉంటుంది. హార్మూజ్ జలసంధి రుసుముల గొడవ మళ్లీ ఉద్రిక్తతలకు నాంది పాడే సూచనలున్నాయి. "ఈ అవగాహనా ఒప్పందం శాశ్వత పరిష్కారం కాదు, చర్చలకు ముసాయిదా మాత్రమే. అసలైన సవాలు ప్రారంభం కాలేదు. మూడు కీలక అంశాల్లో ఏ ఒక్కటి విఫలమైనా మొత్తం శాంతి ప్రక్రియ పటాపంచలవుతుంది. అందువల్ల రాబోయే 60 రోజులు మధ్యప్రాచ్యం భవిష్యత్తును నిర్ణయించే అత్యంత క్లిష్టమైన దశ అని చెప్పాలి. నిజమైన శాంతి సాధనకు మూడు శూలాలను దాటడం తప్పనిసరి!! ■




జీవితంలో కష్టాలు వచ్చినప్పుడు నిజమైన స్నేహితులు ఎవరో తెలిసిపోతుంది. కొన్నిసార్లు ఎంతగానో నమ్మిన వారే పరాయివారితో చేతులు కలిపి ఎదురు తిరుగుతారు. అదే సమయంలో అంతగా పరిచయం లేనివారు, ఊహించని వ్యక్తులు కొండంత అండగా నిలబడతారు. ఇది జీవితం నేర్పించే అతి పెద్ద పాఠం. అందుకే సమస్యలు ఎదురైనప్పుడు 'నువ్వా-నేనా' అని తలపడే వారికంటే, 'మనిద్దరం కలిసి సమస్యను ఎదుర్కొందాం' అని పక్కన నిలబడే వ్యక్తులకు ఎక్కువ ప్రాధాన్యం ఇవ్వాలి. బంధాలు అహంకారంతో బలపడవు. అర్థంతో, ఆదరంతో మాత్రమే బలపడతాయి. ప్రతి చిన్న విషయానికీ వాదించుకోవడం వల్ల సంబంధాలు దెబ్బతింటాయి.

-మహాదేవ

వింతల్లో వింతలు

## చైనాలో వింత వాస్తు విన్యాసం



చైనాలోని కున్‌షాన్ నగరంలో ఉన్న "పిరమిడ్ ఆఫ్ కున్‌షాన్" ఒక అద్భుతమైన నివాస భవనం. హువాకియావో జిల్లాలో 2013లో నిర్మించిన ఈ 18 అంతస్తుల భవనం పిరమిడ్ ఆకారంలో కనిపిస్తుంది. రెండు వైపులా నిటారుగా ఉన్న గోడలు, మరో రెండు వైపులా 45 డిగ్రీల కోణంలో వాలుతూ ఉండే అపార్టుమెంట్లు దీని ప్రత్యేకత. చైనీస్ వరిపంట మెట్టు పొలాల నుండి స్ఫూర్తి పొంది ఈ నిర్మాణాన్ని రూపొందించారు. ప్రతి అపార్టుమెంటుకు విశాలమైన టెర్రస్ ఉన్నప్పటికీ, వెంటిలేషన్, లైటింగ్, అగ్నిమాపక భద్రత వంటి సవాళ్లు కూడా ఈ భవనం ఎదుర్కొంటోంది. ఇది కున్‌షాన్ నగరంలో ప్రముఖ పర్యాటక ఆకర్షణగా మారింది.

# శుబ్‌మన్ సరికొత్త చరిత్ర.. తొలి భారత క్రికెటర్‌గా



టీమిండియా కెప్టెన్ శుబ్‌మన్ గిల్ తన సూపర్ ఫామ్‌ను కొనసాగిస్తున్నాడు. ఐపీఎల్-2026లో దుమ్మురేపిన గిల్.. ఇప్పుడు అదే జోరును అఫ్గానిస్తాన్ సిరీస్‌లో కనబరుస్తున్నాడు. లక్నో వేదికగా అఫ్గాన్‌తో రెండో వన్డేలో గిల్ అద్భుతమైన సెంచరీతో చెలరేగాడు. కేవలం 77 బంతుల్లోనే తన 9వ వన్డే సెంచరీ మార్క్‌ను అందుకున్నాడు. ఓవరాల్‌గా 110 బంతులు ఎదుర్కొన్న గిల్.. 22 ఫోర్లు, 2 సిక్స్‌లతో 154 పరుగులు చేశాడు. ఈ అద్భుత శతకంతో వన్డే క్రికెట్‌లో 3000 పరుగుల మైలురాయిని దాటాడు.

తద్వారా వన్డేల్లో అత్యంత వేగంగా 3000 పరుగులు చేసిన భారత ఆటగాడిగా గిల్ చరిత్ర సృష్టించాడు. ఈ ఫీట్‌ను గిల్ కేవలం 62 ఇన్నింగ్స్‌లలో అందుకున్నాడు. గతంలో ఈ రికార్డు శిఖర్ ధావన్, శ్రేయస్ అయ్యర్(72 ఇన్నింగ్స్‌లు) పేరిట సంయుక్తంగా ఉండేది. తాజా నాక్‌తో వారిద్దరిని శుబ్‌మన్ అధిగమించాడు. బంతులు పరంగా ఈ ఫీట్ సాధించిన జాబితాలో మాజీ కెప్టెన్ కపిల్‌దేవ్(2995) అగ్రస్థానంలో ఉన్నారు. ఆ తర్వాతి స్థానంలో గిల్(3016) ఉన్నాడు. అదేవిధంగా వన్డేల్లో ఫాస్టెస్ట్ 150 చేసిన మూడో ప్లేయర్‌గా వీరేంద్ర సెహ్వాగ్‌ను గిల్ అధిగమించాడు. సెహ్వాగ్ 2011లో వెస్టిండీస్‌పై 112 బంతుల్లో ఈ ఫీట్ సాధించగా.. అఫ్గాన్‌తో మ్యాచ్‌లో గిల్ కేవలం 108 బంతుల్లో ఈ ఘనతను అందుకున్నాడు. ఈ జాబితాలో ఇషాన్ కిషన్(103) అగ్రస్థానంలో ఉన్నాడు. ఈ మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన భారత్ 49.5 ఓవర్లలో 402 పరుగుల భారీ స్కోర్ చేసి ఆలౌటైంది.

# కెనడా, ఖతార్ మ్యాచ్.. ఆ ఒక్కడి కోసం తన్నుకున్న ఆటగాళ్లు!



ఫిఫా ప్రపంచకప్‌లో కెనడా, ఖతార్ మ్యాచ్ ముగిసిన తర్వాత ఇరుజట్ల ఆటగాళ్లు తన్నుకోవడం చర్చనీయాంశమైంది. కెనడా 6-0తో ఖతార్‌పై ఘన విజయాన్ని అందుకుంది. అయితే మ్యాచ్‌లో కెనడా విజయం సాధించినప్పటికీ ఖతార్ ఆటగాళ్ల వైఖరిని తప్పుబట్టారు. అందుకే ఒక్కసారి మ్యాచ్‌లో ఫైనల్ విజిల్ రాగానే కెనడా ఆటగాళ్లు ఖతార్ జట్టువైపు దూసుకొచ్చారు. దఇరుజట్ల ఆటగాళ్లు ఒకరిపై ఒకరు దాడి చేసుకునేందుకు యత్నించారు. ఈ క్రమంలో మైదానంలోకి వచ్చిన సెక్యూరిటీ ఇరుజట్లను వేరు చేసి అక్కడినుంచి పంపించేశారు. ఈ సమయంలో మైదానంలో గందరగోళం నెలకొంది. ఈ చర్యను ఇరుజట్ల కోచ్‌లు తప్పుబట్టారు. దీనికి సంబంధించిన వీడియో వైరల్‌గా మారింది. మరి కెనడా ఆటగాళ్ల కోపానికి కారణం ఏంటా అని ఆరా తీస్తే.. ఖతార్ ఆటగాళ్ల తప్పిదాల వల్ల కెనడా మిడ్‌ఫీల్డర్ ఇస్మాయిల్ కోనె కాలు విరిగింది. నడవడానికి కూడా ఇబ్బంది పడడంతో అతడిని స్ట్రెచర్‌పై తీసుకెళ్లాల్సి వచ్చింది. అయితే ఇస్మాయిల్ కోనె కాలు విరగడానికి ప్రధాన కారణం ఖతార్ ఆటగాడు అస్సిమ్ మదిబో. బంతిని పాస్ అందించడానికి ఇస్మాయిల్ ప్రయత్నిస్తున్న సమయంలో అతడికి అడ్డువచ్చిన అస్సిమ్ కావాలనే తను కాలును వెనుక నుంచి అడ్డుపెట్టాడు. దీంతో కోనె కాలు బోన్ విరిగిపోయింది. ఈ దుశ్చర్యతో రిఫరీ ఖతార్ ఆటగాడికి రెడ్‌కార్డ్ జారీ చేశాడు. మ్యాచ్ విషయానికొస్తే ఆతిథ్య కెనడా.. ఖతార్‌పై పూర్తి ఆధిపత్యం కనబరిచింది. జొనాథన్ డేవిడ్ హ్యాట్రిక్ గోల్స్‌తో కెనడా విజయంలో కీలకపాత్ర పోషించాడు.

## స్పోర్ట్స్

# భారత క్రికెట్‌కు గుడ్ బై.. వేరే దేశానికి ఆడనున్న తెలుగు ప్లేయర్



ఇటీవల భారత క్రికెట్‌కు వీడ్కోలు పలికిన టీమిండియా వికెట్ కీపర్ బ్యాటర్, ఆంధ్ర ప్లేయర్ కె.ఎస్. భరత్ మరో కీలక నిర్ణయం తీసుకున్నాడు. రిటైర్మెంట్ ప్రకటించిన కేవలం 15 రోజుల్లోనే యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ లో తన క్రికెట్ ప్రయాణాన్ని ప్రారంభించేందుకు భరత్ సిద్ధమయ్యాడు. యూఏఈ క్రికెట్ బోర్డు నిర్వహించనున్న స్థానిక టోర్నమెంట్‌లో 'టీమ్ స్టాలియన్స్' జట్టు తరపున భరత్ ఆడనున్నాడు. అయితే 32 ఏళ్ల శ్రీకర్ భరత్ వెంటనే యూఏఈ జాతీయ జట్టుకు ప్రాతినిధ్యం వహించే అవకాశం లేదు. ఐసీసీ నిబంధనల ప్రకారం.. ఫుల్ మెంబర్ నేషన్ నుంచి అసోసియేట్ దేశానికి వెళ్లే ఆటగాళ్లు మూడేళ్ల కూలింగ్-ఆఫ్ పీరియడ్‌ను పూర్తి చేయాలి. అయితే ఫిబ్రవరి 2024లో ఇంగ్లండ్‌తో జరిగిన టెస్ట్‌లో భారత్ తరపున తన చివరి అంతర్జాతీయ మ్యాచ్ ఆడాడు. అంటే అతడు యూఏఈ తరపున ఆడాలంటే వచ్చే ఏడాది ఫిబ్రవరి వరకు వేచి ఉండాల్సిందే. ఈ విశాఖ క్రికెటర్ భారత్ తరపున 7 టెస్ట్ మ్యాచ్‌లు ఆడి 221 పరుగులు చేశాడు. ఫస్ట్‌క్లాస్ క్రికెట్‌లో మాత్రం భరత్‌కు మంచి ట్రాక్ రికార్డు ఉంది. 113 ఇన్నింగ్స్‌లలో 36.53 సగటుతో 6102 పరుగులు చేశాడు. అతడి పేరిట ఓ ట్రిపుల్ సెంచరీ కూడా ఉంది. లిస్ట్-ఎ క్రికెట్‌లో కూడా అతడు అద్భుతంగా రాణించాడు. 83 మ్యాచ్‌లలో 2692 పరుగులు చేశాడు. ఇక తమ జట్టు అగ్రశ్రేణి ఆటగాళ్లలో లాంగ్-ఫార్మాట్ స్కిల్స్‌ను పెంపొందించే లక్ష్యంతో ఈసీబీ ఈ టూ-డే వైట్-బాల్ ఛాంపియన్‌షిప్ టోర్నీని నిర్వహించనుంది. ఈ టోర్నీలో టీమ్ స్టాలియన్స్, టీమ్ ఫాల్కన్స్, టీమ్ ఈగల్స్, టీమ్ లెపర్డ్స్ మొత్తం నాలుగు జట్లు పాల్గొనున్నాయి.



# ఆ మూవీతో సమంత స్పెషల్ బాండ్.. 'అదే నా బెస్ట్'





టాలీవుడ్ స్టార్ హీరోయిన్ సమంత చాలా కాలం తర్వాత 'మా ఇంటి బంగారం' సినిమాతో మన ముందుకు రాబోతున్నారు. నందిని రెడ్డి దర్శకత్వంలో వస్తున్న ఈ క్రేజీ ప్రాజెక్ట్ జూన్ 19న విడుదల కానుంది. ప్రస్తుతం ఈ సినిమా ప్రమోషన్స్ లో ఫుల్ బిజీగా గడుపుతున్న సమంత.. తాజాగా పాల్గొన్న ఒక ఇంటర్వ్యూలో తన కెరీర్, సినిమాలపై కొన్ని ఆసక్తికరమైన కామెంట్స్ చేశారు. ముఖ్యంగా తన మొదటి సినిమా 'ఏ మాయ చేసావే' పై ఆమె చూపించిన ప్రేమ ఇప్పుడు సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారింది. ఆ వివరాలు చూద్దాం..

**ర్యాపిడ్ ఫైర్ రౌండ్‌లో సమంత ఇంట్రెస్టింగ్ ఆన్సర్స్:**

ఇక ప్రమోషన్స్ లో భాగంగా జరిగిన ఒక ఇంటర్వ్యూలో సమంతకు కొన్ని క్రేజీ ప్రశ్నలు ఎదురయ్యాయి. ర్యాపిడ్ ఫైర్ రౌండ్‌లో ఆమె నటించిన హిట్ సినిమాలలో ఒకదాన్ని ఎంచుకోమని అడిగారు. ముందుగా 'ఏ మాయ చేసావే' లేదా 'ఈగ' అని అడగగా.. సమంత ఏమాత్రం ఆలోచించకుండా 'ఏ మాయ చేసావే' వైపే మొగ్గు చూపారు. ఆ సినిమానే తనకు కెరీర్ ఇచ్చిందని, అది లేకపోతే 'ఈగ' లాంటి పెద్ద ప్రాజెక్టులు వచ్చేవి కావని క్లారిటీ ఇచ్చారు.

**'రంగస్థలం', 'ఓ బేబీ'లకే ఓటు వేసిన సామ్:**

ప్రశ్నలు కొనసాగుతూ.. 'ఓ బేబీ' లేదా 'అ ఆ' అని అడగగా ఆమె 'ఓ బేబీ'ని ఎంచుకున్నారు. అలాగే లేడీ ఓరియెంటెడ్ ఫిల్మ్ 'యశోద' లేదా 'రంగస్థలం' లలో దేన్ని ఇష్టపడతారని అడిగితే.. మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ సరసన నటించిన 'రంగస్థలం' చిత్రానికే సమంత ఓటు వేశారు. ఇక వెబ్ సిరీస్ ల విషయానికి వస్తే 'సిటాడెల్' కంటే 'ది ఫ్యామిలీ మ్యాన్' వైపే మొగ్గు చూపారు.

**'ఫ్యామిలీ మ్యాన్' ని కాదని మళ్ళీ 'ఏ మాయ చేసావే':**

అయితే అసలైన ట్విస్ట్ చివర్లో ఎదురైంది. సమంతకు భారీ గుర్తింపు తెచ్చిన 'ది ఫ్యామిలీ మ్యాన్' సిరీస్ లేదా ఆమె మొదటి చిత్రం 'ఏ మాయ చేసావే' లో ఏది బెస్ట్ అని హోస్ట్ అడిగారు. దానికి కూడా సమంత 'ఏ మాయ చేసావే' సినిమానే ఎంచుకున్నారు. "ఆ సినిమా లేకపోతే ఈ రోజు నేను ఇక్కడ ఉండేదాన్ని కాదు, అది నా జీవితాన్ని మార్చేసింది" అంటూ తన డెబ్యూ మూవీపై ఉన్న స్పెషల్ బాండ్ ను బయటపెట్టారు.

**నెట్టింట తెగ వైరల్ అవుతున్న వీడియో:**

సమంత చేసిన ఈ వ్యాఖ్యలు ఇప్పుడు సోషల్ మీడియాలో విపరీతంగా చక్కర్లు కొడుతున్నాయి. దీనికి ఒక ముఖ్యమైన కారణం కూడా ఉంది. 'ది ఫ్యామిలీ మ్యాన్' సిరీస్‌కు సమంత భర్త రాజ్ నిడిమోరు దర్శకుడు కాగా.. 'ఏ మాయ చేసావే' సినిమాలో ఆమె మాజీ భర్త నాగచైతన్య హీరోగా నటించారు. అయినప్పటికీ, సమంత వ్యక్తిగత విషయాలను పక్కన పెట్టి.. తన సినీ ప్రయాణానికి పునాది వేసిన మొదటి చిత్రానికే పెద్ద పీట వేయడం నెటిజన్ల మనసులను గెలుచుకుంటోంది... చివరగా చెప్పాలంటే, ఎంత ఎదిగినా ఒదిగి ఉండడం అంటే ఇదేనేమో. సమంత నేడు పాన్-ఇండియా స్టార్‌గా ఎంతటి గుర్తింపు తెచ్చుకున్నా.. తనను ఇండస్ట్రీకి పరిచయం చేసిన మొదటి సినిమాను, ఆ పాత్రను గుండెల్లో దాచుకుందని ఈ ఇంటర్వ్యూతో ప్రూవ్ అయింది. మరి జూన్ 19న రాబోతున్న 'మా ఇంటి బంగారం' సినిమాతో సమంత ఎలాంటి మ్యాజిక్ క్రియేట్ చేయబోతుందో చూడాలి!

PENSATTA TELUGU DAILY Printed, Published, Owned by CHITAMANENI ANIL KUMAR, D.NO 1-1, RAJULA ILLA PAKKANA, VENKATAPURAM, THANAM POST, MUNGAPAKA MANDAL, ANAKAPALLI VISHAKAPATNAM, ANDHRA PRADESH 531021 ,Publishe at D.NO 1-1, RAJULA ILLA PAKKANA, VENKATAPURAM, THANAM POST, MUNGAPAKA MANDAL, ANAKAPALLI VISHAKAPATNAM, ANDHRA PRADESH 531021 . And Printed at Chaitanya Vaaradhi printers, Do.No 2-99 Bharanikam, Paravada Anakapalli, Visakhapatnam- 531 021. Editor: CHITAMANENI ANIL KUMAR, D.NO 1-1, RAJULA ILLA PAKKANA, VENKATAPURAM, THANAM POST, MUNGAPAKA MANDAL, ANAKAPALLI VISHAKAPATNAM, ANDHRA PRADESH 531021 , Cell: 99853 15759, RNI. No APTEL/2023/87729, E-mail:anilchinthamneni@gmail.com